ఈనాడు చిత్తూరు

ఆదివారం 27 ఆగస్టు 2017 16 పేజీలు



బొజ్జగణపయ్య.. మా ఒజ్జ నీవయ్య..

వరసిద్ధుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం రాత్రి సిద్ధిబుద్ధి సమేతుడై హంసవాహనంపై ఊరేగుతున్న కాణిపాక వినాయకస్వామివారు.. 6లో



16 లో

వినాయక చవితి ఉత్సవాలు ఊరూవాడా శుక్రవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. వీధివీధిన విఘ్నేశ్వరుడుకి మండపాలు తీర్చిదిద్ది కొలువుదీర్చారు. తిరుపతి పెద్దకాపువీధిలో రైతుగా ఎడ్లబండిపై వెళుతున్న వినాయకుడి రూపం ఆకట్టుకుంది. ఈనాడు, తిరుపతి






నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా శనివారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. 3లో

చిత్తూరు

కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయంలో గతంలో జరిగిన తప్పుల్ని నేటికీ దిద్దుకోలేక తలమునకలవుతున్నారు. 2010లో కడప రమణయ్య ఉపకులపతిగా ఉన్నప్పుడు జరిగిన సిబ్బంది నియామకాలు మరోసారి వివాదానికి బీజం వేశాయి. అప్పట్లో నియమితులైన 34 మంది తాత్కాలిక సిబ్బందిని రెగ్యులర్ చేస్తున్నారని తెలుసుకున్న ఇక్కడి ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆందోళన బాటపట్టారు. తమ డిమాండ్లను నెరవేర్చాకే ప్రొబేషన్ డిక్లేర్ చేయాలంటూ వాదిస్తున్నారు. తాజాగా 198 మంది ఉద్యోగుల ఆందోళన వర్సిటీలో చర్చనీయాంశమైంది.

పదే..పదే.. అదే తప్పు



- ద్రావిడ వర్సిటీలో తాత్కాలిక ఉద్యోగుల క్రమబద్ధీకరణ?
- కొందరికే వర్తింపుపై సిబ్బంది ఆందోళన
- పాత తప్పులకు కొనసాగింపుగా తాజా వ్యవహారం

2010లో అప్పటి వీసీ కడప రమణయ్య తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చారు. అందులో బోధనా, బోధనేతర సిబ్బంది పోస్టులున్నాయి. రెగ్యులర్ పద్ధతిలో నియామకాలంటే అభ్యర్థులు భారీగా వస్తారని, తాత్కాలికమనే పేరుతో నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆరోపణలున్నాయి. దీంతో తక్కువ మంది దరఖాస్తు చేసుకోగా, చివరిగా 34 మందిని నియమించారు. ఈ నియామకాలు సరిగ్గా జరగలేదని అప్పట్లో యూనివర్సిటీలోని కొందరు ఉద్యోగులు హైకోర్టుకు వెళ్లారు. ఈ ఎంపికల్ని తాత్కాలిక ప్రాతిపదికన కాకుండా శాశ్వత పద్ధతిలో చేపట్టాలని దాదాపు 10మంది న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ 34 పోస్టులను శాశ్వత ప్రాతిపదికన ఎంపిక చేసేందుకు రీనోటిఫికేషన్ ఇవ్వాలంటూ 2012లో ... మిగతా 7లో

'ఫీజుల మేత'లో.. తొలివికెట్ ఔట్

- 'ఈనాడు' కథనానికి స్పందన
- ద్రావిడ వర్సిటీ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

... వివరాలు 7లో

లాభాల బాటలో ఆర్టీసీ

లక్ష్యాన్ని మించిన 5 డిపోలు



తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: జిల్లాలోని 14 ఆర్టీసీ డిపోల్లో 5 డిపోలు ఆశించిన ఆదాయాన్ని ఆర్జించాయి. నాలుగు మాసాలకు కేటాయించిన లక్ష్యాలను అధిగమించి ప్రతిభ చూపిన డిపో మేనేజర్లకు ఆర్ఎం వి.నాగశివుడు అభినందన లేఖలు పంపారు. ఏప్రిల్, మే, జూన్, జులై మాసాల్లో డిపోలకు నిర్దేశించిన లక్ష్యాన్ని 5 డిపోలు అధిగమించడంపై ఆర్టీసీ ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేస్తూ ఏడాది పొడవునా ఇదే తరహా పనితీరు కనబరచాలని కోరారు. లక్ష్యాన్ని మించి రాబడి సాధించిన డిపోలలో తిరుపతి మంగళం డిపోకు నాలుగు మాసాలకుగాను రూ.16.27 కోట్లు కేటాయించగా రూ. 17.50 కోట్ల రాబడి వచ్చింది. చిత్తూరు-1 డిపోకు రూ.16.23 కోట్లు లక్ష్యంకాగా రూ.16.26 కోట్లు, చిత్తూరు-2 ... మిగతా 7లో

ఆటో బోల్తా

అయిదుగురికి గాయాలు

మదనపల్లె (నేరవార్తలు), న్యూస్‌టుడే: ఆటో బోల్తాపడి అయిదుగురు గాయపడ్డారు. ఈ సంఘటన పుంగనూరు మండలంలో శనివారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. పుంగనూరు నుంచి మదనపల్లెకు కర్ణాటకలోని ముల్‌బాగిల్‌కు చెందిన శారద(46), చంద్రశేఖర్(58), అపూర్వ(25), వలసపల్లెకు చెందిన సలీం(28) ఆటోలో బయలుదేరారు. ఆటో చోదకుడు వలసపల్లెకు చెందిన శివశంకర్(30) వేగంగా నడపటంతో సుగాలిమిట్ట వద్ద ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు, చోదకుడు గాయపడ్డారు. వారిని మదనపల్లె 108 సిబ్బంది గోపి, సాంబల ప్రథమచికిత్స చేసి మదనపల్లె ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. మదనపల్లె రెండోపట్టణ పోలీసులు సమాచారాన్ని పుంగనూరు పోలీసులకు తెలియజేశారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం

పాకాల, న్యూస్‌టుడే: చంద్రగిరి మండలం, నరసింగాపురం సమీపంలో రైలు పట్టాలపై గుర్తుతెలియని 40ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. ఈ విషయాన్ని పాకాల రైల్వే పోలీసులకు తెలియజేశారు. మృతుడు నీలిరంగు ప్యాంటు, నీలిరంగు చొక్కా ధరించి ఉన్నాడు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని తిరుపతికి తరలించారు. పాకాల రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ప్రత్యేక కార్యదళం దాడులు

❖ 28 ఎర్రదుంగలు స్వాధీనం ❖ నిందితుడి అరెస్టు ❖ కార్యదళ సిబ్బందికి స్వల్పగాయాలు

ఎ.రంగంపేట, చిన్నరామాపురం(చంద్రగిరి), న్యూస్‌టుడే: శేషాచల అడవిలో ప్రత్యేక కార్యదళం డీఐజీ మాగంటి కాంతారావు నేతృత్వంలో ఆర్ఎస్సై వాసు, భాస్కర్ బృందాలు వేర్వేరుగా దాడులు నిర్వహించాయి. ఈ నేపథ్యంలో 28 ఎర్రచందనం దుంగలతో బాటు తమిళనాడు రాష్ట్రం ధర్మపురికి చెందిన ఆండి(58) తమిళకూలీని అదుపులోకి తీసుకున్నారు. మరో 34మంది ఎర్రదొంగలు అడవిలోకి పారిపోయారు. ఈ ఘటనలో ఇద్దరు ప్రత్యేక కార్యదళం పోలీసు కానిస్టేబుళ్ళకు గాయాలయ్యాయి. ప్రత్యేక కార్యదళం అధికారులు తెలిపిన సమాచారం మేరకు రహస్యంగా అందిన సమాచారం మేరకు మండలంలోని చిన్నరామాపురం గ్రామానికి ఉత్తరదిశలో ఉన్న దట్టమైన అటవీ ప్రాంతంలో ఆర్ఎస్ఐ వాసు బృందం శనివారం వేకువజామున కూంబింగ్ చేపట్టింది. ఆ సమయంలో ఎర్రచందనం దుంగలు మోసుకువస్తున్న కూలీలు దుంగలను అక్కడే పడవేసి అడవిలోకి పారిపోయారు. వారిని వెంబడించిన ప్రత్యేక కార్యదళం తమిళనాడు రాష్ట్రం ధర్మపురికి చెందిన ఆండి(58)ని అదుపులోకి తీసుకుంది. వారిని పట్టుకునే సమయంలో ఇద్దరు కానిస్టేబుళ్లు అదుపుతప్పి పడిపోవడంతో వారికి గాయాలయ్యాయి. వెంటనే



ప్రత్యేక కార్యదళం స్వాధీనంచేసుకున్న దుంగలతో పాటు అదుపులోకి తీసుకున్న నిందితుడు ఆండి

వారిని వైద్యసేవల నిమిత్తం రుయా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రదేశంలో ఎర్రదొంగలు పడేసి వెళ్లిన 14 దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

ఈతగుంటలో..

ఆరేపల్లి రంగంపేట పంచాయతీ ఈతగుంటలో ఆర్ఎస్సై భాస్కర్ బృందం కూబింగ్ చేపట్టారు. ఈ క్రమంలో శేషాలచ అడవినుంచి 14 మంది నిందితులు దుంగలను మోసుకువస్తూండటాన్ని గమనించిన కార్యదళం అప్రమత్తమై వారిని పట్టుకోడానికి ప్రయత్నించినా క్షణాల్లో ఎర్రదొంగలు దుంగలను పడేసి అడవిలోకి పారిపోయారు. ఆ సమయంలో చిన్నపాటి వర్షం పడుతుండటంతో ప్రత్యేక కార్యదర్యదళం వారిని వెలంబడించినా ఫలితందక్కలేదు. ఆ ప్రదేశంలో చెల్లాచెదురుగా పడిఉన్న 14 దుంగలను స్వాధీనం చేసుకున్నారు.

కాశిపెంట్ల వద్ద..

కాశిపెంట్ల వద్ద శుక్రవారం చంద్రగిరి పోలీసులు ఓ తమిళనాడు బస్సును అదుపులోకి తీసుకున్నారు. ముందస్తుగా అందిన సమాచారంతో సీఐ శివప్రసాద్ తమ సిబ్బందిని అప్రమత్తం చేసి పూతలపట్టు- నాయుడుపేట మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో కేవలం డ్రైవరు, కండక్టర్‌తో ప్రయాణిస్తున్న తమిళనాడుకు చెందిన ఆర్టీసీ బస్సు తటస్థ పడటంతో అనుమానం వచ్చి బస్సును అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో కండక్టర్ వడలూరు, వేలూరు నుంచి వస్తున్న తమ బస్సులో వడలూరు వద్ద 30మంది ప్రయాణీకులు ఎక్కారని.. వారందరూ కాశిపెంట్ల వద్ద బస్సును నిలిపి కిందకు దిగివేయడంతో తాము ఖాళీ బస్సును తీసుకొస్తున్నట్టు డ్రైవరు రవికుమార్, కండక్టర్ చంద్రశేఖర్‌లు పోలీసులకు తెలిపారు. దీంతో తమిళనాడు బస్సును అదుపులో తీసుకున్నారు. పోలీసుల ద్వారా సమాచారం అందుకున్న తమిళనాడు ఆర్టీసీ డీజీఎం చంద్రగిరికి చేరుకోవడంతో బస్సును అప్పగించారు. డ్రైవరు రవికుమార్, కండక్టర్ చంద్రశేఖర్‌లను న్యాయస్థానానికి అప్పగించారు. పోలీసు విచారణలో భాగంగా తమిళనాడుకు చెందిన మూడు ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు, కండక్టర్లు ఒక్కో కూలీ వద్దనుంచి రూ. 500 వసూళ్లుచేసి అటవీ సమీప గ్రామాల వద్ద వారిని దిగబెడుతున్నారని పోలీసు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ కేసులో మరో నలుగురిని సైతం న్యాయ స్థానానికి అప్పగిస్తామని పోలీసులు వివరించారు.

యువతి దారుణ హత్య



హత్యకు గురైన యువతి

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుచానూరు-తనపల్లె మార్గంలోని స్వర్ణముఖి పరివాహక ప్రాంతంలోని నిర్మానుష్య ప్రదేశంలో ఓ యువతి దారుణహత్యకు గురైంది. అసలు ముఖం పూర్తిగా రూపురేఖలు మారిపోయి గుర్తుపట్టేందుకు వీల్లేకుండా పోయింది. ఆ ప్రాంతంలో మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు శనివారం గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సుమారు 30సంవత్సరాల వయసున్న ఓ యువతి రెండురోజుల క్రితం హత్యకు గురైంది. హతురాలిముఖం పూర్తిగా నల్లబడిపోయి ఉంది. శరీరంపై ఎలాంటి దుస్తులు లేకపోవడంతో ఆత్యాచారం చేసి ఆ తర్వాత చున్నీని మెడకు చుట్టి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహం సమీపంలో మద్యం బాటిళ్లను పోలీసులు గుర్తించారు. ఇద్దరుముగ్గురు కలిసి అక్కడకు వచ్చి మద్యం సేవించి ఆపై ఈ హత్యకు పాల్పడి ఉంటారనే కోణంలో విచారణ సాగుతోంది. హతురాలికి సంబంధించిన వివరాలు ఏమాత్రం తెలియరాలేదు. ఆమె ఎడమ చేతిపై మాత్రం కె.అనిత అనే పచ్చబొట్టు కనపిస్తోంది. ఈ సంఘటనలో ఎవరెవరు అక్కడకు వచ్చారు.. అసలు ఆ యువతి ఎవరు.. తదితర అన్ని విషయాలపై నిశితంగా దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గల కారణాలు ఏమిటి.. దీని వెనుక ఎవరున్నారనే దిశగా కూపీ లాగుతున్నారు. తిరుచానూరు సీఐ భాస్కర్, ఎస్సై మధు సూదన్, క్లూస్‌టీం ఇన్‌ఛార్జ్ మనోహర్ మృతదేహాన్ని పరిశీలించా రు. ఆమెకు సంబంధించిన సమాచారం తెలిస్తే తిరుచానూరు పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ భాస్కర్ కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జడ్పీఛైర్‌పర్సన్ గీర్వాణి



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ రాజశేఖరబాబు

యువకుడి ఆత్మహత్య



రవి మృతదేహం

మదనపల్లె (నేరవార్తలు), న్యూస్‌టుడే : మనస్తాపంతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. అనంతపురం జిల్లా ఎన్పీకుంట మండలం బలిజపల్లెకు చెందిన సాంబశివ, నర్మద పదేళ్ల క్రితం బెంగళూరుకు వెళ్లి కూలిపనులు చేసుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు గీత, గిరిజ, కుమారుడు రవి(19) ఉన్నారు. కుమార్తెలకు వివాహాలు కాగా కుమారుడు ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. వినాయక చవితి సందర్భంగా రవి మదనపల్లెలో ఉన్న తన అక్క గిరిజ ఇంటికి ఈనెల 24న వచ్చాడు. ఇతను బెంగళూరులో ఓ యువతిని ప్రేమించాడు. ఆ యువతి ఇతని ప్రేమను అంగీకరించకపోవటంతో మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి అక్క బావ రామాంజులు వినాయకుడి గుడికి వెళ్లిన సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి తిరిగి వచ్చిన అక్క బావలు ఉరికి వేలాడుతున్న రవిని కిందకు దించి మదనపల్లె ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ఆసుపత్రికి వచ్చే సరికే అతను మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం శవాలగదిలో ఉంచారు. సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఒకటో పట్టణ ఎస్సై దస్తగిరి తెలిపారు.

అధికార లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు

చిన్నబండపల్లె(పూతలపట్టు), న్యూస్‌టుడే: పూతలపట్టు మండలంలోని చిన్నబండపల్లె గ్రామానికి చెందిన మురుగన్(29) గురువారం ఉదయం పంజాబ్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... ఆర్మీలో జరుగుతున్న బాక్సింగ్ క్రీడలో అనుకోకుండా గాయపడటంతో కోమాలోకి వెళ్లాడు. నాలుగు రోజుల పాటు చికిత్సపొందుతూ మృతి చెందాడు. శనివారం ఉదయం 5 గంటల ప్రాంతంలో మృతదేహాన్ని సొంత గ్రామానికి తీసుకొచ్చారు. మృతదేహాన్ని జడ్పీఛైర్‌పర్సన్ గీర్వాణి, జిల్లా తెదేపా ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, ఎస్పీ రాజశేఖరబాబు, డీఎస్పీలు, ఎంపీపీ వీణ, జడ్పీటీసీ సభ్యురాలు వనజ, మండల తెదేపా కన్వీనర్ దొరబాబు, ఎంపీడీవో శ్రీదేవి, ఇతర నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఆర్మీ సిబ్బంది లాంఛనాలతో దహన క్రియలు నిర్వహించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: చిత్తూరు మహిళలు ఆర్థికంగా ఎదగాలని, కుటుంబానికి ఆసరగా నిలవాలని జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న ఆకాంక్షించారు. స్టాండప్ ఇండియా కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్టీ కార్పోరేషన్ ఆధ్వర్యంలో పెనుమూరు మండలం అడవిపల్లె గ్రామానికి చెందిన రోజాకు ఇన్నోవా కారును మంజూరు చేశారు. ఈ కారును శనివారం రాత్రి జిల్లా సచివాలయంలో జిల్లా పాలనాధికారి చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా పాలనాధికారి కారును స్టార్ట్ చేసి లబ్ధిదారులకు అందించారు.

నేపాల్ ప్రధానికి ఘన సత్కారం



నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బాకు శ్రీవారి, అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న తితిదే ఈవో సింఘాల్, జేఈవో శ్రీనివాసరాజు



తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా దంపతులను తితిదే ఘనంగా సత్కరించింది. శ్రీవారిని శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి వీరు దర్శించుకున్నారు. అంతకుముందు మధ్యాహ్నం 2 గంటలకు తిరుమలకు వచ్చిన నేపాల్ ప్రధానికి తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు పుష్పగుచ్ఛాలు అందచేసి స్వాగతం పలికారు. గంట పాటు భోజన విరామం అనంతరం శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. వీరిని మహాద్వారం వద్ద ఆలయ సంప్రదాయం ప్రకారం ఆహ్వానించి స్వామి సన్నిధికి తీసుకెళ్లారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం వకుళా మాత, విమాన వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకుంటూ వచ్చి హుండీలో కానుకలు సమర్పించారు. అనంతరం విశ్రాంతి భవనానికి చేరుకుని తిరుగు ప్రయాణం అయ్యారు. తితిదే అధికారులు దేవ్‌బా దంపతులకు తిరుమలకు వచ్చిన సమయంలో స్వాగతం, తిరుగు ప్రయాణం సమయంలో వీడ్కోలు ఘనంగా పలికారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి కాల్వ శ్రీనివాసులు, కలెక్టరు ప్రద్యుమ్న పాల్గొన్నారు. సీవీఎస్‌వో రవికృష్ణ బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. తిరుమలలో నేపాల్ ప్రధాని పర్యటన దాదాపు మూడు గంటల పాటు సాగింది.

నేపాల్ ప్రధానికి ఘనస్వాగతం

రేణిగుంట, న్యూస్‌టుడే: నేపాల్ దేశ ప్రధాన మంత్రి బహదూర్ దేవ్‌బాకు శనివారం రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. తిరుమల శ్రీవారి దర్శనార్థం ఆయన ప్రత్యేక విమానంలో హైదరాబాదు నుంచి మధ్యాహ్నం 12.20గంటలకు ఇక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు విమానాశ్రయంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర సమాచార, పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖ మంత్రి కాలువ శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, డీఐజీ ప్రభాకర్‌రావు, అర్బన్ ఎస్పీ అభిషేక్ మహంతి, ఏపీడీ పుల్లా, తిరుపతి సబ్ కలెక్టర్ నిశాంత్‌కుమార్, రేణిగుంట తహసిల్దార్ నరసింహులునాయుడు తదితరులు స్వాగతం పలికారు. నేపాల్ ప్రధానితో పాటు ఆ దేశ మంత్రులు జ్ఞానేంద్ర బహదూర్, జితేంద్ర నారాయణ దేవ్, మీన్ బహదూర్ బిశ్వకర్మ, ఆ దేశ ప్రజాప్రతినిధులు, ప్రధాని కుటుంబసభ్యులు, అధికారులు సుమారు 53మంది ప్రత్యేక విమానంలో ఇక్కడకు విచ్చేశారు. అనంతరం వీరు రోడ్డు మార్గంలో తిరుమలకు బయలుదేరి వెళ్లారు. శ్రీవారి దర్శనానంతరం సాయంత్రం 4.55గంటలకు మళ్లీ వీరు విమానాశ్రయానికి చేరుకుని గయకు బయలుదేరి వెళ్లారు.

నేపాల్ ప్రధానికి వీడ్కోలు సందర్భంగా శ్రీవారి చిత్రపటం అందజేస్తున్న మంత్రి కాల్వ శ్రీనివాసులు, చిత్రంలో కలెక్టర్ ప్రద్యుమ్న

డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



కె.చౌడేశ్వరి

మదనపల్లె (నేరవార్తలు), న్యూస్‌టుడే : మదనపల్లె సబ్ డివిజన్‌ను రాష్ట్రంలో సాంకేతిక పోలీసింగ్ విభాగంగా తీర్చిదిద్దుతానని మదనపల్లె డీఎస్పీ కె. చౌడేశ్వరి అన్నారు. శనివారం సాయంత్రం ఆమె మదనపల్లె కార్యాలయంలో డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. ఇంతకు ముందు హైదరాబాదు, నెల్లూరు, గుంటూరు ప్రాంతాల్లో పనిచేసినట్లు తెలిపారు. సబ్‌డివిజన్‌లో శాంతిభద్రతలు కాపాడి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మదనపల్లె సీఐ నిరంజన్‌కుమార్, పీలేరు సీఐ నాగరాజు, ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు, ఎస్సైలు దస్తగిరి, సుకుమార్, గంగిరెడ్డి, నాగేశ్వరావు, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.

ఎస్సీ, ఎస్టీల విజ్ఞప్తుల స్వీకరణ

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే : జిల్లా సచివాలయంలో 2వ సంయుక్త పాలనాధికారి చంద్రమౌళి అధ్యక్షతన శనివారం ఎస్సీఎస్టీలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమస్యల పరిష్కారం కోరుతూ 37 మంది ఎస్సీఎస్టీలు, 56 మంది దివ్యాంగులు అధికారులకు విన్నవించుకున్నారు. వీటిలో దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న భూసమస్యలే అధికంగా ఉన్నాయి. ఫించన్లు, స్థల మంజూరు, గృహ నిర్మాణం, స్వయం ఉపాధి పథకం రుణాలు, ప్రభుత్వ ఉద్యోగమివ్వాలని, రేషన్‌కార్డులు, వైద్య ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని పలువురు విన్నవించారు. వాటిని పరిశీలించి సాధ్యమైన మేరకు సత్వరం పరిష్కరించాలని జేసీ 2 సంబంధిత శాఖల అధికారులకు సిఫార్సు చేశారు. ఫిర్యాదులు స్వీకరించిన వారిలో జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ శ్రీనివాస్, సాంఘిక సంక్షేమశాఖ జేడీ విజయకుమార్, ఇన్‌ఛార్జి గిరిజన సంక్షేమ శాఖాధికారి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

అలిపిరి.. బారులుదీరి..



నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవబా కుటుంబసమేతంగా శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థం శనివారం తిరుమలకు వచ్చారు. భద్రతా చర్యల్లో భాగంగా తిరుపతి అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గంటకు పైగా వాహనాలను నిలిపివేశారు. దాంతో కిలోమీటరుకు పైగా వాహనాలు బారులుదీరాయి. ఎక్కువ సమయం నిరీక్షించాల్సి రావడంతో భక్తులు కొంత అసౌకర్యానికి గురయ్యారు. **ఈనాడు, తిరుపతి**

లక్ష్యాలు సాధించకపోతే చర్యలు తప్పవు

● జిల్లా పాలనాధికారి ప్రద్యుమ్న ● అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రగతిపై సమీక్ష

చిత్తూరు(జిల్లా సచివాలయం), న్యూస్‌టుడే : అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తప్పవని జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న హెచ్చరించారు. శనివారం రాత్రి జిల్లా సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో వారాంతపు ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఇదే సమయంలో మండలస్థాయి అధికారులతో వీడియో సమావేశం ద్వారా సమావేశమయ్యారు. ప్రధానంగా పంటసంజీవనీ నీటి కుంటల తవ్వకం పనులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మదనపల్లె, ములకలచెరువు, పలమనేరు క్లస్టర్ పరిధిలో పనులు సక్రమంగా జరగడంలేదన్నారు. ఈఏడాది లక్ష కుంటలు తవ్వాలని నిర్ణయించామని, ఇందులో ఈ సెప్టెంబరు నెలాఖరుకు 35వేలు లక్ష్యంగా నిర్దేశించినా ఇప్పటి వరకు 23వేలు మాత్రమే పూర్తి చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ పక్కా గృహాల నిర్మాణాలు నత్తనడకన సాగుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై వర్కిన్‌స్పెక్టర్లు వారానికి 12 పక్కా గృహాలు పూర్తి చేయించాలని ఆదేశించారు. ఇదే తరహాలో ఎఈలను లక్ష్యాలను నిర్దేశించారు. లక్ష్య సాధనలో చివరన నిలిచేవారి జాబితాను ఇస్తే సస్పెండ్ చేస్తానన్నారు. నీరు-ప్రగతి పనులు ప్రగతిపైనా అసంతృప్తి వ్యక్తం చేస్తూ పుంగనూరు డీఈపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణాల్లో జరుగుతున్న జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవనాలకు అవసరమైన నిధులు మంజూరు చేస్తున్నా ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు. ఉద్యానవన పంటల సాగు, సిమెంటు రోడ్లు, స్వచ్ఛభారత్, మరుగుదొడ్ల నిర్మాణాలపై సమీక్షించారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న

తిరుపతి



శ్రీరామ్ పెళ్లి పత్రికను చూపిస్తున్న మంత్రి పరిటాల సునీత

అక్టోబరు 1న మా అబ్బాయి పెళ్లి


శ్రీవారి ఎదుట శుభలేఖ

అందజేసిన మంత్రి పరిటాల సునీత

తిరుమల, న్యూస్‌టుడే: అక్టోబరు 1న తన కుమారుడు పరిటాల శ్రీరామ్ వివాహం జరుగుతుందని రాష్ట్ర మంత్రి పరిటాల సునీత వెల్లడించారు. శ్రీవారిని మంత్రి శుక్రవారం ఉదయం దర్శించుకుని స్వామివారి పాదాల చెంత వివాహ ఆహ్వాన పత్రికలను ఉంచి అందుకున్నారు. అనంతరం ఆలయం ఎదుట మంత్రి మాట్లాడుతూ దివంగత పరిటాల రవి, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశీస్సులతో శ్రీరామ్‌కు వివాహం జరగనుందని తెలిపారు. ఓటమి భయంతో వైకాపా నేతలు నంద్యాలలో దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. కనీవినీ ఎరుగని అభివృద్ధి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అక్కడి ప్రజలు పట్టం కడతారని, భారీ మెజార్టీ రానుందని ధీమా వ్యక్తం చేశారు. మంత్రికి తితిదే ఓఎస్డీ లక్ష్మీనారాయణ యాదవ్ స్వాగతం పలికి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందచేసి సత్కరించారు.

పవిత్రోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: తిరుపతిలోని శ్రీగోవింద రాజస్వామి వారి ఆలయ పవిత్రోత్సవాల గోడపత్రికలను స్థానిక తితిదే పరిపాలనా భవనంలో తితిదే తిరుపతి జేఈవో పోలా భాస్కర్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు పవిత్రోత్సవాలు జరుగుతాయని, ఈనెల 31న అంకురార్పణతో ప్రారంభమవుతాయన్నారు. 1న పవిత్రప్రతిష్ఠ, 2న మూలవర్లకు, ఉత్సవమూర్తులకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి, మూడ వీధుల్లోని శ్రీమఠం ఆంజనేయస్వామి వారికి పవిత్రాల సమర్పణ జరగనుందని చెప్పారు. 3న పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగుస్తాయని వివరించారు. మూడు రోజుల పాటు స్వామి, అమ్మవార్లకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తితిదే స్థానికాలయాల డిప్యూటీ ఈవో వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో శ్రీసీతా సమేత కోదండ రామస్వామి, లక్ష్మణ స్వామి

భక్తులను కటాక్షించిన కోదండరామస్వామి

తిరుపతి(క్రీడలు), న్యూస్‌టుడే: తిరుపతి శ్రీ కోదండ రామాలయంలోని శ్రీసీతా సమేత కోదండ రామస్వామి, లక్ష్మణ స్వామి నాలుగు మాడవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఆలయంలో శనివారం పురస్కరించుకొని ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం నాలుగు మాడవీధుల్లో బంగారు తిరుచ్చిలో ఊరేగారు. అనంతరం ఊంజల్‌సేవ వైభవంగా నిర్వహించారు. రాత్రి 9 గంటలకు ఏకాంతసేవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలయం ప్రధాన అర్చకులు ఆనందకుమార్‌దీక్షితులు, డిప్యూటీ ఈవో బి.మునిలక్ష్మీ, పర్యవేక్షకులు మునికృష్ణారెడ్డి, ఇన్‌స్పెక్టరు శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితునికి మూడేళ్ల జైలు

తిరుపతి(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: దాడి కేసులో ఓ నిందితునికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ తిరుపతి మూడో అదనపు మున్సిఫ్ న్యాయమూర్తి శాయికుమారి శనివారం తుది తీర్పు వెలువరించారు. కోర్టు లైజన్ పోలీసు అధికారి భక్తవత్సలం, కోర్టు పోలీసు ఉపేంద్ర కథనం మేరకు... నిందితుడు తిరుపతి పెద్దకాపులేఅవుట్‌కి చెందిన పి.కమల్‌కిశోర్‌రెడ్డిపై తిరుపతి పశ్చిమ పోలీసుస్టేషన్‌లో దాడి కేసు నమోదైంది. కేసు సాక్ష్యాధారాలతో నిరూపితంకాగా జైలుశిక్ష విధించారు.

విలీనం.. ఇక ప్రగతి పథం!

- కార్పొరేషన్‌లోని విలీన గ్రామాలకు మహర్దశ
- రూ.67 కోట్లతో అభివృద్ధికి పచ్చజెండా
- సమస్యలు తీరినట్లే!

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాలకు మహర్దశ పట్టనుంది. నగరంలో విలీనమైన మూడు పంచాయతీల్లో అభివృద్ధిని వేగవంతం చేసేందుకు నిధుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇందుకు రూ.67 కోట్లతో స్థానిక ఎమ్మెల్యే సుగుణమ్మ నేతృత్వంలో అధికారులు రూపొందించిన ప్రతిపాదనలకు ఈనెల 15న తిరుపతిలో నిర్వహించిన జెండాపండుగ వేదికగా సీఎం చంద్రబాబునాయుడు సుముఖత వ్యక్తం చేసి నిధులు మంజూరుకు అంగీకరించారు. రానున్న రెండు నెలల్లో విలీన పంచాయతీలైన రాజీవ్‌నగర్, తిమ్మినాయుడుపాలెం, ఎమ్మార్‌పల్లెల్లో అభివృద్ధి పనులు ప్రారంభం కానున్నాయి.

- న్యూస్‌టుడే, జీవకోన(తిరుపతి)



తిరుమలరెడ్డి నగర్‌లో కాలువలు లేక వీధిలో నిలిచిన మురుగునీరు

తిరుపతికి అత్యంత సమీపంలో ఉండి.. నగరంలో కలసిపోయినట్టుగా ఉండే రాజీవ్‌నగర్.. నగరంలో విలీనమైన నాటి నుంచి అభివృద్ధి పనులు జరుగుతూనే ఉన్నాయి. కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్న తొలినాళ్లలోనే పంచాయతీ అభివృద్ధికి సుమారు రూ. 100 కోట్లు మంజూరు చేశారు. వీటితో గంగ నీటి సదుపాయం పొంది, విలీన గ్రామాల్లోనే తొలిగ్రామంగా రికార్డులకు ఎక్కింది. సీసీ రోడ్లు, మురుగుకాలువల నిర్మాణం పనులను 70శాతం వరకు పూర్తిచేశారు. కొన్ని పరిమిత కాలనీలకు యూడీఎస్ సదుపాయాన్ని కల్పించారు. మిగిలిన వాటికి అవకాశం కల్పించాల్సి ఉంది. పక్కనే ఉన్న తిరుమల కొండల నుంచి వచ్చే వరదనీరు ప్రవహించే కాలువల నిర్మాణంతోపాటు, ప్రధాన మురుగు నీటి కాలువల నిర్మాణం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటికే సత్యనారాయణపురం నుంచి తిరుపతి కరకంబాడి మార్గం వరకు ప్రధాన కాలువను నిర్మించారు. పైభాగంలో జీవకోన నుంచి సత్యనారాయణపురం వరకు కాలువ నిర్మించి అనుసంధానం చేయాల్సి ఉంది. అలానే సంతోషమ్మనగర్, పార్వతినగర్, అరుణోదయనగర్‌ల మీదుగా ప్రవహిస్తున్న ప్రధాన కాలువ నిర్మాణం పనులు చేపట్టాలి. ఈ కాలువను వెంకటగిరి స్కూల్ వద్ద నుంచి మాధవనగర్ మీదుగా ఇటీవల నిర్మించిన పెద్దకాలువకు అనుసంధానం చేయాల్సిన అవసరం ఉంది. ఈరెండు పెద్దకాలువలు కలిసేందుకు తిరుపతి-కరకంబాడి మార్గంపై నిర్మించిన ప్రధాన కాలువ ఎత్తుపెంచాలి. పూర్తిస్థాయిలో ఎల్ఈడీ వీధిదీపాలను ఏర్పాటు చేయాల్సి ఉంది.

తిమ్మినాయుడుపాలెం..

నగరంలో విలీనమై తిమ్మినాయుడుపాలెం గ్రామంలో ఇప్పటి వరకు ప్రత్యేకంగా అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదనే చెప్పవచ్చు. గ్రామం పరిధిలోని పల్లెలు, కాలనీలకు తెలుగు గంగ నీటి సదుపాయం ఇప్పటి వరకు లేదు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థగానీ, మురుగునీటి కాలువల నిర్మాణం, సీసీరోడ్ల నిర్మాణం ఇప్పటివకు అనేక కాలనీల్లో చేపట్టలేదు. తిమ్మినాయడుపాలెం దళితవాడ, ఎస్సీ కాలనీ, ఆటోనగర్ సమీపంలోని అంబేడ్కర్‌కాలనీల్లో సబ్‌ప్లాన్ నిధులతోనే కొన్ని అభివృద్ధి పనులు చేపట్టారు. అలానే కాటన్‌మిల్లు, ఎస్బీఐకాలనీల్లోనూ సీసీరోడ్లు నిర్మించారు.

కార్పొరేషన్‌కు స్వాగత కాలనీలుగా ఉన్న భూపాల్‌హౌసింగ్‌కాలనీ, తిరుమలరెడ్డినగర్, ఆటోనగర్‌తోపాటు వెంకటరెడ్డినగర్, కట్టకిందూరు, మిట్టూరు, పద్మావతిపురం, పూలవానిగుంట, కొరమేనుగుంట పరిధిలోని కాలనీల్లో ఇప్పటి వరకు మౌలిక సదుపాయాల లేక జనం ఇబ్బందులు పడుతున్నారు.

ఎమ్మార్‌పల్లె..

గ్రామం తొలినుంచీ నగరంతో మమేకమై ఉన్నందున విలీనమైన తొలినాళ్ల నుంచే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. తెలుగుగంగ నీటి సదుపాయం కల్పించినా ఇప్పటికీ తాగు నీటి సమస్య వేధిస్తూనే ఉంది. పంచాయతీలోని సీతమ్మనగర్‌లాంటి మురికివాడల్లో ఇప్పటికీ మౌలిక సదుపాయాల సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ఇవన్నీ చేస్తే మూడు పంచాయతీల్లో సమస్యలు తీరినట్లే.



రాజీవ్‌నగర్‌లో సీసీరోడ్డుగా మారాల్సిన వీధి



కనీస వసతులు లేని వెంకటరెడ్డినగర్

వ్యవసాయ విద్యార్థుల మౌన దీక్ష

తిరుపతి(పశువైద్య విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల తీరును నిరసిస్తూ తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ అధికారులకు వ్యతిరేకతంగా నోటికి నల్లగుడ్డలు కట్టుకుని మౌనదీక్ష చేపట్టారు. తిరుపతి- చంద్రగిరి మార్గంలోని వ్యవసాయ కళాశాల ప్రవేశద్వారం వద్ద బైఠాయించి మౌనదీక్ష నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారులు వ్యవసాయ విద్యను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్ని జీవో నెంబరు 64ను విడుదల చేసినట్లు విద్యార్థులు ఆరోపించారు. జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ విద్యార్థులు తరగతులు బహిష్కరించి ఆందోళన నిర్వహిస్తున్నా.. ప్రభుత్వం, వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జీవో 64 అమలైతే వ్యవసాయానికి రైతులు దూరం కావాల్సిందే అని విద్యార్థులు అన్నారు.



మౌన దీక్ష చేపట్టిన విద్యార్థులు

పశువైద్య వర్సిటీని సందర్శించనున్న ఐసీఏఆర్ అక్రిడిటేషన్ బృందం

తిరుపతి(పశువైద్య విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయాన్ని భారత వ్యవసాయ పరిశోధన మండలి అక్రిడిటేషన్ బృందం సోమవారం నుంచి సందర్శించనున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ వై.హరిబాబు తెలిపారు. విశ్వవిద్యాలయానికి అక్రిడిటేషన్ పొంది ఐదేళ్ల కాలం ముగిసినందున బృందం పర్యటిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈనెల 28న ఐదుగురు సభ్యులతో కూడిన బృందం తిరుపతిలోని విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో ఉపకులపతితో సమావేశం నిర్వహించిన 29న తిరుపతిలోని పశువైద్య కళాశాల, డెయిరీ టెక్నాలజీ కళాశాలలలో పర్యటిస్తారని ఆయన ప్రకటించారు. ఈనెల 30న కడప జిల్లా ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలను, 31న నెల్లూరు జిల్లాలోని ముత్తుకూరు మత్స్య కళాశాల, సెప్టెంబర్ 1న గన్నవరంలోని పశువైద్య కళాశాలను సందర్శిస్తారని చెప్పారు. ఐసీఏఆర్ నిబంధనలకు అనుగుణంగా కళాశాలల నిర్వహణ, మౌలిక సదుపాయాలను వారు పరిశీలిస్తారని వివరించారు. రాష్ట్రంలోని అన్ని పశువైద్య కళాశాలను సందర్శించిన అనంతరం సెప్టెంబరు 2న తిరుపతిలోని ఉపకులపతితో సమావేశం నిర్వహించి వివరాలను నివేదించనున్నట్లు విశ్వవిద్యాలయ ప్రజా సంబంధాల అధికారిణి డాక్టర్ త్రివేణి తెలిపారు.

రైతుబజారులో కూరగాయల ధరలు

తిరుపతి(తాతయ్యగుంట), న్యూస్‌టుడే: తిరుపతిలోని రైతుబజారులో కూరగాయల ధర(కిలో)ల వివరాలను ఎస్టేట్ అధికారి అక్తర్ షరీఫ్ తెలిపారు. **శనివారం నాటి ధరలు ఇలా...** టమోటా- రూ.38, వంకాయలు- రూ.30,40 బెండకాయలు- రూ.24, మిరపకాయలు- రూ.30,50, కాకరకాయలు- రూ.30, బీరకాయలు- రూ.24, కాలిఫ్లవర్- రూ.25, అల్లం- రూ.60, క్యారెట్- రూ.50, క్యాబేజి- రూ.20, దొండకాయలు- రూ.26, సొరకాయలు- రూ.10, ఉర్లగడ్డలు- రూ.18, తెల్లగడ్డలు- రూ.60, ఎర్రగడ్డలు- రూ.23, చామగడ్డలు- రూ.30, కందగడ్డలు- రూ.40, పందిరి చిక్కుడు- రూ.50, గోరుచిక్కుడు- రూ.24, దోస కాయలు- రూ.18, అరటికాయ(1)- రూ.10, మునక్కాయలు- రూ.50, బీట్‌రూట్- రూ.32, ముల్లంగి- రూ.24, బీన్స్- రూ.56, ఆకుకూరలు- రూ.5,7. ఈ ధరలు ఆదివారం ఉదయం 8 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఘనంగా మదర్ థెరిసా జయంతి

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: స్థానిక తిరుమల బైపాస్ రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం జగన్మాత చర్చి ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆమె వేషధారణలో అలరించారు. అనంతరం అనాథాశ్రయంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పాలు, పండ్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీసుధ, బాలరాజు, పురుషోత్తం, ప్రవీణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మదర్ థెరిసా వేషధారణలో చిన్నారులు

నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలు

తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే: తిరుపతి నగరంలో రద్దీ సమయాల్లో చెట్లు కొమ్మలు తొలగించడంతో ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శనివారం తిరుపతి సున్నపు వీధి కూడలి కరిమారియమ్మ ఆలయం వద్ద ఉదయం 11గంటల సమయంలో నగర పాలక సిబ్బంది చెట్టు కొమ్మలు తొలగించారు. దీంతో నగర వాసులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బంది పడ్డారు.

తిరుపతి

మీరూ స్పందించండి..!

తిరుపతివాసులను సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రతి వార్డులోనూ ప్రజలు పలు సమస్యలతో సతమతమవుతున్నారు. చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి వారాలు, నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం నగరవాసులు 'ఈనాడు'ను ఆశ్రయిస్తున్నారు. ప్రజల నుంచి వాట్సాప్ ద్వారా సమస్యలు స్వీకరించి వాటిని నగరపాలిక అధికారుల దృష్టికి తీసుకెళుతుండడంతో సత్వరం పరిష్కరిస్తున్నారు. అందిన సమస్యలు.. వాటి పరిష్కారం ఇలా..

- న్యూస్‌టుడే, తిరుపతి(నగరపాలిక)

వెలగని వీధిదీపం



సమస్య: 50వ వార్డులోని ఇంటి నెంబరు 21-13-50 వద్ద విద్యుత్ స్తంభానికి ఉన్న విద్యుత్ దీపం పనిచేయడం లేదు. ఎల్‌ఈడీ వీధి దీపం అమర్చిన కొద్ది కాలానికే పనిచేయకుండా పోయింది. ఈ మార్గం చాలా అధ్వానంగా ఉండి.. రాత్రి వేళల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నగరపాలిక అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించడం లేదు. వీలైనంత త్వరగా మరమ్మతులు పూర్తి చేసి వీధిదీపం వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

- నవీన్, మంగళం

సమాధానం: పనిచేయని విద్యుత్‌దీపం స్థానంలో మరో ఎల్ఈడీ దీపాన్ని అమర్చి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

- సుధాకరరావు, ఎస్.ఈ, నగరపాలిక



చెత్తమయంగా ఖాళీస్థలం

సమస్య: టి.నగర్‌లో అపరిశుభ్ర వాతావరణం ఎక్కువగా ఉంది. మురుగునీటి కాలువలు సక్రమంగా లేవు. అంతేకాదు ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. చెత్తతో దోమలు ఈ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నాయి. ఖాళీ స్థలం ఎలుకలకు ఆవాసంగా మారి పరిసర ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. నగరపాలిక అధికారులు చర్యలు తీసుకోవాలి. **- షేక్ జావీద్, టి.నగర్**

సమాధానం: టి.నగర్‌లోని ఖాళీ స్థలాల యజమానులను హెచ్చరించి చెత్తను ఖాళీ స్థలాల్లో వేయనీకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

- డాక్టర్ ఉషాకుమారి, వైద్యాధికారిణి

రాములవారి గుడి పరిసరాల్లో చెత్త



సమస్య: రాముల వారి గుడి పరిసరాలను అధికారులు పట్టించుకోవడం లేదు. ఆలయం చుట్టూ వాహనాలు, ఇతర తోపుడు బండ్లతో నిండిపోయింది. ఆలయం పరిసరాల్లో రాకపోకలకు సైతం ఇబ్బందిగా ఉంది. కొందరు వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు, ఇతర వస్తువులు తెచ్చి మాడవీధుల్లో వేసి వ్యర్థాలను గుట్టలుగా వేస్తున్నారు. చెత్తను రెండు, మూడు రోజులకొకసారి కూడా శుభ్రం చేయడం లేదు. దీంతో ఆలయం పరిసరాలు చాలా అపరిశుభ్రంగా మారాయి. వ్యాపారులను ఖాళీ చేయిస్తే పరిసర ప్రాంత ప్రజలకు, భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఉంటుంది.

- రాములవారి ఆలయ పరిసర ప్రాంత ప్రజలు

సమాధానం: ఆ ప్రాంతాన్ని పరిశీలించి అపరిశుభ్రమైన వాతావరణం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ ఉషాకుమారి, నగరపాలిక వైద్యాధికారిణి



సమస్య: ముత్యాలరెడ్డిపల్లెలోని పీడబ్ల్యుడి అతిథిగృహం ఎదుట ఉన్న రహదారి బాగా దెబ్బతిని గుంతమయంగా మారింది. రహదారిలో రాకపోకలు సాగించాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంది. ఇటీవల నగరపాలిక కమిషనర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా ఆయన రహదారిని పరిశీలించారు. ఆ తరువాత పట్టించుకోలేదు. పంచాయతీ కార్యాలయం నుంచి శ్రీకృష్ణనగర్‌కు నిత్యం వెళ్లే వారు ఎక్కువగా ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మార్గాన్ని మరమ్మతులు చేయకపోతే స్థానికులకు అవస్థలు తప్పవు.

-కేవీరెడ్డి, శ్రీకృష్ణానగర్


సమాధానం: ఆ ప్రాంతాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

- సుధాకరరావు, ఎస్.ఈ, నగరపాలిక సంస్థ

మీరూ స్పందించండి

మీ డివిజన్‌లో సమస్యలా? రహదారులు దెబ్బతిన్నాయా? కాలువల్లో మురుగు నిండిందా? రహదారుల వెంట చెత్త దర్శనమిస్తోందా?.. ఇలాంటి సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి 'ఈనాడు' మీకో అవకాశం కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా డివిజన్‌లో సమస్యపై ఫొటో తీసి, పేరు, చిరునామాతో ఈ కింద ఇచ్చిన వాట్సప్ నంబరుకు పంపించండి. సమస్యలను స్వయంగా పరిశీలించి ప్రచురిస్తాం..

వాట్సాప్ నంబరు: 80080 20003



గీతం స్కూల్ న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి నాగ శశిధర్‌రెడ్డి

నగరంలో న్యాయవిజ్ఞాన సదస్సులు

తిరుపతి(న్యాయవిభాగం), న్యూస్‌టుడే: నగరంలో రెండు చోట్ల న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహించినట్లు మండల న్యాయసేవాధికార సంస్థ అధికారులు శనివారం తెలిపారు. నగరంలోని గీతం స్కూల్, బాలికల పరిశీలనా గృహంలో సదస్సులు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి నాగ శశిధర్‌రెడ్డి, రెండో అదనపు మున్సిఫ్ న్యాయమూర్తి ఆర్.సన్యాసినాయుడు హాజరై ప్రసంగించారు. భారత రాజ్యాంగం గురించి పిల్లలకి తెలిపారు. కార్యక్రమంలో గీతం స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు, గీతం స్కూల్ ప్రిన్సిపల్ శ్రీదేవి తదితరులు హాజరయ్యారు.



సామవేద ఉపాకర్మ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న పండితులు

వేదవర్సిటీలో సామవేద ఉపాకర్మ మహోత్సవం

తిరుపతి(సాంస్కృతికం), న్యూస్‌టుడే: శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో సామవేద ఉపాకర్మ మహోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి నేతృత్వం వహించిన డాక్టర్ గిరిజాప్రసాద్ షడంగీ మాట్లాడుతూ ఉపాకర్మ అంటే ప్రతిఏడాది వేదమును ప్రారంభించు దినమని చెప్పారు. ఉపాకర్మను ఆచరించిన విద్యార్థులకే వేదము చెప్పాల్సి ఉంటుందన్నారు. ఉపాకర్మ చేయడం ద్వారా శారీరక, మానసిక, వాచక పాపములు ప్రక్షాళన అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో సామవేద విభాగాధ్యాపకులు, సుదర్శన కులకర్ణి, కృష్ణన్ శ్రౌతి, పీఆర్‌ఓ బ్రహ్మాచార్యులు, ఆనంద్, విభాగ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి సినిమా




ప్రతాప్ - నేనే రాజు నేనే మంత్రి
జయశ్యామ్- అర్జున్‌రెడ్డి
విఖ్యాత్- ఆనబెల్
బిగ్‌సినిమా- లై
వేల్‌రామ్స్- బాహుబలి 2
జగత్- అర్జున్‌రెడ్డి
శ్రీనివాస- నక్షత్రం
కృష్ణతేజ- నేనేరాజు నేనేమంత్రి
సంధ్య - వివేకం
సీవీఎస్- ఆనందోబ్రహ్మ
మినీ ప్రతాప్- ఫిదా
శ్రీనివాసతేజ- జంటిల్‌మెన్(హిం)
పీజీఆర్- జయ జానకి నాయక
తేజ - గౌతమనంద
ఐ.ఎస్.మహల్- అంధగాడు
పళణి- పోదువగ ఎన్ మనసు తంగం(త)



కార్యక్రమంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న వీసీ దామోదరం

నిరంతర ప్రక్రియగా.. విజ్ఞాన సముపార్జన

తిరుపతి(ఎస్వీ విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: విజ్ఞాన సముపార్జన ఒక నిరంతర ప్రక్రియ అని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య దామోదరం పేర్కొన్నారు. ఎస్వీయూలోని సెనేట్‌హాల్‌లో శనివారం 'డీఎస్‌టీ ఇన్‌స్పైర్ గ్రూప్ మానిటరింగ్ వర్క్‌షాప్' ప్రారంభమైంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీసీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విద్యా విధానంలో అనేక నూతన పోకడలు సంభవిస్తున్నాయని, వాటిని అధిగమించడానికి విద్యావేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు, సామాజిక వేత్తలు తదితరులు పరిష్కారమార్గాలను అన్వేషించాలని పిలుపునిచ్చారు. 2020నాటికి ప్రపంచ ఆర్థిక గమనానికి భారతదేశం ప్రధాన కేంద్రం అవుతుందన్నారు. అనేక నూతన ఆవిష్కరణలవైపు విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఇన్‌స్పైర్ ప్రోగ్రామ్‌ను భారత సైన్స్ అండ్ టెక్నాలజీ వారు రూపొందించారని పేర్కొన్నారు. శాస్త్రీయ పరిశోధన పత్రాలలో మనదేశం అగ్రగామిగా ఉందన్నారు. 2010 నుంచి 2016 వరకు భారతదేశం ఆవిష్కరణల దశాబ్దంగా భారత ప్రభుత్వం ప్రకటించిందన్నారు. భారత్‌లో యువత శాతం అధికంగా ఉన్నందున రానున్న రోజుల్లో భారతదేశం ప్రపంచంలో అగ్రగామిగా నిలిచేందుకు విద్యార్థులను శాస్త్ర, సాంకేతిక రంగాలపై మరింత మక్కువ కలిగించే విధంగానూ, నూతన ఆవిష్కరణలకు రూపకల్పన చేసే విధంగానూ తీర్చిదిద్దాలని, అందుకు ఇన్‌స్పైర్ పోగ్రాం దోహదం చేస్తుందని ఉపకులపతి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ఆచార్య ప్రతిభాజౌలి మాట్లాడుతూ శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విద్యార్థుల అభివృద్ధికి డీఎస్‌టీ దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య దేవరాజులు, ఈసీ మెంబర్ డాక్టర్ గురుప్రసాద్, కో-ఆర్డినేటర్ ఆచార్య శ్రీధర్ రెడ్డి, అధ్యాపకులు, ప్రతినిధులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి విచ్చేసిన ప్రతినిధులు, పరిశోధకులు

ప్రణామం.. పావన వనమాలి
భజేహం.. భక్తజన బాహుబలి!

- సత్యప్రమాణాల దేవుని బ్రహ్మోత్సవాలు ఘనంగా ఆరంభం
- కనుల పండువగా ధ్వజారోహణం





స్వామివారి దర్శనార్థం క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

చాలు.. చాలు.. ఈ జన్మకు ఇది చాలు!
ఏమి రూపం.. అది ఎంత అపురూపం..
లిప్తపాటు దర్శించినా చాలు
తరించును మా సప్తతరాలు!!
కనుద్వయం కాంచినంతనే
కడతేరు కటిక కష్టాలు!
నిండైన నిన్ను చూసినంతనే
పులకించే మా మేను..
ముల్లోక వీర.. మహిమాన్విత దేవా..
గౌరీ తనయా.. తొలిపూజల రాజా..
వరాల వనమాలీ.. భక్తజన బాహుబలీ
నమోనమామి.. మనసాస్మరామి..

- న్యూస్‌టుడే, కాణిపాకం



బొజ్జగణపయ్య.. బ్రహ్మాండ వేడుక

వరసిద్ధుని ఉత్సవ శోభకు తెరలేచింది... శనివారం భక్తజనుల జయజయధ్వానాల నడుమ బ్రహ్మోత్సవాల ధ్వజారోహణం కనుల పండువగా జరిగింది. ఉదయం ఉత్సవాల నాందిలో భాగంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఉదయం 7.45 నుంచి 8.45 గంటల మధ్య ధ్వజస్తంభం పైకి మూషిక పటాన్ని ఎగురవేసి ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికారు. అంతకుముందు సిద్ధిబుద్ధి సమేతుడైన వరసిద్ధి వినాయకస్వామి వారిని, త్రిశూలాన్ని, మూషిక పటాన్ని కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. మూషిక పటాన్ని ఎగురవేసి సకల దేవతలకు ఆహ్వానం పలికారు. అనంతరం ధ్వజస్తంభానికి పంచామృతాభిషేకం నిర్వహించారు. యాగశాలలో సాయంత్రం 108 కలశాలను ఉంచి పూజలు నిర్వహించారు. ఈవో పెనుమాక పూర్ణచంద్రరావు కంకణధారులయ్యారు. రాత్రి స్వామివారికి గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. కాకర్లవారిపల్లెకు చెందిన గాలి మునస్వామినాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఈవో పెనుమాక పూర్ణచంద్రరావు, ఏఈవో కేశవరావు, సూపరింటెండెంట్ స్వాములు, కాణిపాకం సర్పంచి కేసీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, అర్చకులు పాల్గొన్నారు.

గౌరీ తనయాయ.. హంస వాహనాయ.. వందనం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారు హంసవానంపై ఊరేగారు. కాణిపాకం, అగరంపల్లె, కారకాంపల్లె, వడ్రాంపల్లె, తిరువణంపల్లెకు చెందిన శీర్‌కరుణీక వంశస్థులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈ క్రమంలో ఉదయం ఆలయంలోని మూలవిరాట్టుకు సంప్రదాయబద్ధంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టును ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి వాహన సేవ ఘనంగా జరిగింది.

నేత్రపర్వం... అద్భుత ఘట్టం

కాణిపాకం, న్యూస్‌టుడే: శుక్రవారం వినాయకచవితి రోజున వేకువజామున స్వామివారి మూలవిగ్రహానికి అభిషేకం నిర్వహించి, ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం భక్తులకు వేకువజాము 3 గంటల నుంచి స్వామివారి దర్శనం కల్పించారు. ప్రభుత్వం తరపున మంత్రి పైడికొండల మాణిక్యాలరావు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయంలో పుష్పాలంకరణ భక్తులను కట్టిపడేసింది.




నేత్రపర్వం... వినాయక విహారం: వినాయకచవితి సందర్భంగా శుక్రవారం రాత్రి కాణిపాకం పురవీధుల్లో ఊరేగుతున్న వినాయకుడు



పుష్పం.. పులకించే కనుద్వయం: ఆకట్టుకుంటున్న పుష్పాలంకరణ



స్వామివారికి పట్టువస్త్రాలను అందిస్తున్న తెదేపా దివంగత నేత మహదేవనాయుడు కుమారుడు గురజాల సందీప్



వరసిద్ధుడి దర్శనార్థం వస్తున్న జిల్లా కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న



పట్టువస్త్రాలను తీసుకొస్తున్న ఈవో పూర్ణచంద్రరావు



అమాత్యా అందుకో హారతి: కర్పూర హారతులందుకొంటున్న మంత్రి మాణిక్యాలరావు



హారతి.. ప్రణతి: ధ్వజారోహణ అనంతరం ధ్వజస్తంభానికి హారతులిస్తున్న ప్రధాన అర్చకులు

లాభాల బాటలో ఆర్టీసీ

(మొదటి పేజీ తరువాయి) డిపోకు రూ.18.77 కోట్ల లక్ష్యానికి గాను రూ.19.08 కోట్లు, మదనపల్లె-1 డిపోకు రూ.17.84 కోట్లకు రూ.18.13 కోట్లు, మదనపల్లె -2 డిపోకు రూ.15.60 కోట్లు లక్ష్యం నిర్ణయించగా రూ.15.98 కోట్లు రాబడి వచ్చింది. లక్ష్యాన్ని మించి ఆదాయాన్ని ఆర్జించిన డిపోల బాటలో మిగతా డిపోలు పనిచేయాలని ఆర్ఎం సూచించారు.

నష్టాలు తగ్గించడంలో తిరుపతి డిపో ఏడోస్థానం

తిరుపతి ఆర్టీసీ ఆర్ఎం నాగశివుడు

పీలేరు ఆర్ఎస్‌మెయిన్, న్యూస్‌టుడే : రాష్ట్రంలో కార్మికుల కృషితో నష్టాలు తగ్గించడంలో తిరుపతి రీజియన్ ఏడోస్థానంలో ఉందని, తెలుగువెలుగు బస్సులను రాబడితో సంబంధం లేకుండా ప్రజాసేవ కోసం నడుపుతున్నామని ఎక్స్‌ప్రెస్ సర్వీసులు మాత్రం వ్యాపారదృష్టిలో నడుపుతున్నామని ఆర్టీసీ తిరుపతి రీజినల్ మేనేజరు జయచంద్ర స్పష్టం చేశారు. శనివారం ఆర్ఎం పీలేరు ఆర్టీసీ మరమ్మతుల కేంద్రంలో కార్మికులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ సంస్థ మనుగడకు కార్మికులు కూడా ఆచరణీయ సలహాలు ఇవ్వవచ్చని అన్నారు. రీజియన్ గత ఏడాది రూ.43 కోట్ల వరకు నష్టాలు ఉండగా ఈ ఏడాది ఇప్పటివరకు రూ.21 కోట్లకు తగ్గిందని ఇందుకు కార్మికులు అంకిత భావంతో పనిచేయడమేనని అన్నారు. నెలకు రీజియన్ మొత్తంలోని డిపోల ద్వారా రూ.60 కోట్ల రాబడి వస్తుండగా అందులో రూ.25కోట్లు రీజియన్‌లో పనిచేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు 7,800 మందికి వేతనాలు, ఇంధనానికి రూ.25కోట్లు చెల్లిస్తున్నామని తెలిపారు. జిల్లాలో 14 డిపోలుండగా తిరుమల, అలిపిరి, మంగళం తప్ప మిగిలిన అన్నిడిపోలు నష్టాల్లో నడుస్తున్నాయని అన్నారు. నష్టాలు తగ్గించడంలో మదనపల్లె-1, చిత్తూరు-2, పీలేరు ముందున్నాయని ఇందులో ఆయా డిపోల మేనేజర్లు, కార్మికుల అంకితభావం అభినందనీయమని అన్నారు. ఆదివారం నుంచి ఆర్టీసీ ఆధ్వర్యంలో పూర్తి స్థాయి కార్గో సర్వీసులు నడుపుతున్నందున నెలకు రాష్ట్రం మొత్తంలో రూ.20కోట్ల రాబడి వస్తుందని అంచనాలున్నట్లు ఆర్ఎం చెప్పారు. సమావేశంలో వివిధ కార్మికసంఘాల నాయకులు సుబ్రమణ్యం, వల్లి, నాగరాజ పాల్గొన్నారు.

పదేపదే.. అదే తప్పు!

వాంపల్లి(శ్రీకాళహస్తి గ్రామీణం), న్యూస్‌టుడే: కన్నతల్లి కఠినంగా మారింది.. పొత్తిళ్లలో కళ్లు తెరచి రెండు నెలలైనా గడవక ముందే ఆ మగ శిశువును ముళ్లపొదల్లో వదిలి వెళ్లిన సంఘటన శ్రీకాళహస్తి మండలం వాంపల్లి సమీపం పోలి మార్గంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎవరు కన్నా బిడ్డో తెలియదుకానీ.. మధ్యాహ్నం పోలి మార్గంలో వెళుతున్న మహిళలకు బిడ్డ కేకలు వినిపించడంతో రోడ్డు పక్కనేఉన్న ముళ్లపొదల్లో పరిశీలించగా పండంటి మగశిశువు ఏడుస్తూ కనిపించాడు. దీంతో వెంటనే వారు బిడ్డను చేతుల్లోకి తీసుకుని చుట్టూ పరిశీలించినా ఎవరు కనిపించలేదు. దీంతో సమీప పొలాల్లో పనిచేస్తున్న కూలీలు, అటుగా వెళ్లే స్థానికులు పలువురు అక్కడకు చేరుకుని సీడీపీవో వింధ్యావళ్లికి సమాచారం అందజేశారు. వాంపల్లికి చేరుకున్న సీడీపీవో ఆ మగశిశువును స్వాధీనం చేసుకుని చిత్తూరులోని శిశువిహార్ నిర్వహకులకు అప్పగించారు. సీడీపీవో మాట్లాడుతూ మగశిశువు నాలుగు కిలోల బరువు కలిగి ఆరోగ్యంగా ఉన్నట్లు పేర్కొన్నారు.



శిశువిహార్‌లో అప్పగించేందుకు మగ శిశువును తీసుకెళుతున్న సీడీపీవో వింధ్యావళ్లి

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

చిత్తూరు(విద్య), న్యూస్‌టుడే : జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డీఈవో శామ్యూల్ తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, పురపాలక, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 20ఏళ్ల సర్వీసు కలిగి, గతంలో మండల స్థాయి అవార్డు పొందిన వారు దరఖాస్తుకు అర్హులని చెప్పారు. దరఖాస్తులను మండల, ఉప, జిల్లా విద్యాశాఖాధికారుల నుంచి పొందవచ్చన్నారు. దరఖాస్తుతో పాటు ఇతర వివరాలు 50పేజీలు మించకుండా ఈ నెలాఖరులోగా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలి. గడువు తర్వాత ఎట్టిపరిస్థితుల్లో దరఖాస్తులు స్వీకరింపబడదని ఆయన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రూప్-1 ప్రధాన పరీక్షకు 62.23 శాతం హాజరు

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-1 ప్రధాన పరీక్షలో భాగంగా శనివారం పేపర్-5 పరీక్ష నిర్వహించారు. తిరుపతిలోని రెండు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 62.23 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. శ్రీపద్మావతి జూనియర్ కళాశాల కేంద్రంలో 400 మందికి 263 మంది, ఎస్వీడబ్ల్యూ డిగ్రీ, పీజీ కళాశాలలో 431 మందికి గాను 253 మంది అభ్యర్థులు హాజరైనట్లు పరీక్ష నిర్వాహకులు తెలిపారు. పరీక్షల నిర్వహణను పరీక్ష సమన్వయ కర్త, డీఆర్వో రజియా బేగం కేంద్రాలలో తనిఖీలు నిర్వహించారు. మిగిలిన ఒక పేపరు 28వ తేదీ జరగనుంది.

ఇన్‌ఛార్జి ఆర్ఐవోగా కృష్ణయ్య

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ బోర్డు ఇన్‌ఛార్జి ప్రాంతీయ పర్యవేక్షణాధికారిగా ఎం. కృష్ణయ్య శనివారం తిరుపతిలోని ప్రాంతీయ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆర్ఐవో మునెయ్య సెలవుపై వెళ్లడంతో ఇన్‌ఛార్జిగా కలకడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణయ్యను నియమిస్తూ విద్యాశాఖ కమిషనర్ ఉదయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయన్ని జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి విశ్వనాథనాయక్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రవి, సభ్యులు నాగసురేష్, శ్రీధర్, రాధాకృష్ణయ్య, రాజనాల, హేమలత, అపరంజి తదితరులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



కృష్ణయ్య



ఆందోళన చేస్తున్న జేఏసీ సభ్యులు

రిజర్వేషన్ కల్పించాలంటూ జేఏసీ ఆందోళన

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే : ప్రభుత్వ, ఒప్పంద ఉద్యోగ నియామకాల్లో దివ్యాంగులకు 3శాతం రిజర్వేషన్ కల్పించాలంటూ వికలాంగుల జేఏసీ సభ్యులు శనివారం జిల్లా సచివాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఆసంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ వివిధ శాఖల్లో ఉన్న ఖాళీల నియామకాల్లో వికలాంగులకు కేటాయించాల్సిన 3శాతం పోస్టులను సకలాంగులకు ఇస్తున్నారని, తమకు అన్యాయం జరుగుతోందన్నారు. స్వయం ఉపాధి రుణాల మంజూరులోను దివ్యాంగులకు అందాల్సిన కోటా ప్రకారం రుణాలు మంజూరు కావడం లేదన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.

లంబోదరుడికి 1,116కిలోల భారీ లడ్డూ నైవేద్యం

తుమ్మలగుంట, తిరుపతి(గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని తుమ్మలగుంటలో ఏర్పాటుచేసిన షిర్డిసాయి ఆకారంలో ఉన్న వినాయకుడికి 1,116 కిలోల భారీ లడ్డూ నైవేద్యంగా సమర్పించారు. ఏటా స్వామివారికి నైవేద్యం సమర్పించిన రీతినే ఈ ఏడాది ముస్లిం సోదరులు అష్రఫ్, షరీఫ్ 1,116 కిలోల భారీ లడ్డూ నైవేద్యంగా అందజేశారు. వినాయకుని ఆకారంలో రూపొందించిన ఈ భారీ లడ్డూ అందరిని ఆకట్టుకుంటోంది. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు ప్రత్యేకంగా ఈ లడ్డూ గురించి చర్చించుకుంటున్నారు. ఈ లడ్డూను వినాయకుడి నిమజ్జనం రోజున వేలం వేయనున్నట్లు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు.



గణనాధునికి నైవేద్యంగా సమర్పించిన 1,116 కిలోల భారీ లడ్డూ

జూనియర్ ఇంటర్

స్టడీప్లాన్

ప్రతిభ

వృక్షశాస్త్రం

వృక్షశాస్త్రం పరిచయం అవసరం లేని శాస్త్రం. ప్రతి ఒక్కరూ జీవితంలో మొక్కల గురించి ఎంతో కొంత తెలుసుకునే ఉంటారు. వృక్షశాస్త్ర అధ్యయనం ద్వారా ప్రస్తుతం పర్యావరణంలో చోటుచేసుకుంటున్న కాలుష్యాన్ని నివారించేందుకు భావి తరాన్ని సంసిద్ధం చేయొచ్చు. మనం జీవించడానికి అతి ముఖ్యమైన ఆక్సిజన్‌ను అందించే మొక్కల పట్ల సహజమైన ఆసక్తి ఉన్న విద్యార్థులెవరైనా పరీక్షల్లో మంచి మార్కులు సాధించగలరనడంలో సందేహం లేదు.

అవగాహనతోనే అనుకున్న మార్కులు...

ఇంటర్మీడియట్ బైపీసీ గ్రూపు మొదటి సంవత్సరం విద్యార్థులు వృక్షశాస్త్ర అధ్యయనంలో కొన్ని మెలకువలు తెలుసుకుంటే వారు పబ్లిక్ పరీక్షలు, నీట్, ఎంసెట్‌కు తగిన విధంగా సంసిద్ధం కావచ్చు. అన్ని విజ్ఞాన శాస్త్ర విభాగాల్లాగే వృక్షశాస్త్ర అధ్యయనానికి కావాల్సిన ప్రాథమిక లక్షణాలు "పరిశీలన, విశ్లేషణ." సిలబస్‌లో చదువుకునే అనేక విషయాలను మన చుట్టూ ఉండే మొక్కల్లో పరిశీలించి విషయ జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. బొమ్మలు గీసి, భాగాలను గుర్తించడం లాంటి నైపుణ్యాలను పెంపొందించుకుని, విషయ విశ్లేషణ చేసి పాఠ్యగ్రంథం (text book)ను పూర్తిగా అనుసరిస్తే పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించవచ్చు. IPE - 2018 కి తయారయ్యే మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం కొన్ని సూచనలు...

- ★ మొదటగా బాటనీ (వృక్షశాస్త్రం) I సిలబస్‌ను పరిశీలిస్తే మొదటి సంవత్సర పాఠ్యపుస్తకంలో 7 యూనిట్‌లు, వీటిలో 13 అధ్యాయాలు (Chapters) ఉంటాయి. సిలబస్‌లోని అన్ని అధ్యాయాలు ముఖ్యమైనవే. అవగాహన కోసం పుస్తకంలోని ప్రతి వాక్యాన్ని చదివి, సొంతంగా నోట్సు రాసుకుంటే మంచిది. ఎన్నో రకాల స్టడీ మెటీరియల్స్, గైడ్స్ అందుబాటులో ఉన్నా పాఠ్యపుస్తకాన్ని పూర్తిగా అవగాహన చేసుకుంటేనే విద్యార్థులు IPE, NEET, EAMCET లో అత్యధిక మార్కులు పొందగలుగుతారు.

IPE ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే ప్రశ్నల స్వరూపం, మార్కుల వెయిటేజీ కొంత వరకు తెలుసుకోవచ్చు. కింద ఇచ్చిన వెయిటేజ్ టేబుల్ గతంలో జరిగిన పరీక్షల్లోని ప్రశ్నపత్రాల ఆధారంగా రూపొందించింది. ప్రశ్నపత్రంలో పేపర్ సెట్టర్‌లు మార్పులు చేసే వీలుంటుంది/ లేదా ప్రశ్నల వెయిటేజీలో మార్పులు చేసి ఇవ్వొచ్చు. ఇది కేవలం విద్యార్థుల అవగాహన కోసం మాత్రమే.

యూనిట్	అధ్యాయాలు (Chapters)	2 M	4 M	8 M	మొత్తం
I	1-4	3(6)	2(8)	-	14
II	5	2(4)	-	1(8)	12
III	6,7	-	1(4)	1(8)	12
IV	8	1(2)	1(4)	-	06
V	9, 10, 11	3(6)	2(8)	-	14
VI	12	-	1(4)	1(8)	12
VII	13	1(2)	1(4)	-	06
					76

యూనిట్ - I

ఇందులో జీవప్రపంచంలో వైవిధ్యం అనే యూనిట్‌కు సంబంధించి నాలుగు అధ్యాయాలు ఉన్నాయి. ఈ అధ్యాయాల్లో జీవశాస్త్రంలోని మౌలిక అంశాలు, జీవుల వైవిధ్యం, విట్టేకర్ అయిదు రాజ్యాల వర్గీకరణ, వృక్షశాస్త్ర ఆవశ్యకత, పరిధి, వృక్షశాస్త్ర విభాగాలు మొదలైన అంశాలను చర్చించారు. లైకెన్‌ల లాంటి ప్రత్యేకమైన జీవుల గురించి, వైరస్‌లు, బ్యాక్టీరియా, సయనో బ్యాక్టీరియా, మైకోప్లాస్మాలు, విరాయిడ్‌లు లాంటి జీవుల గురించి ఆసక్తికరమైన విషయాలు తెలుసుకుంటారు. వృక్షరాజ్యంలోని శైవలాలు, బ్రయోఫైట్లు, టెరిడోఫైట్లు, వివృతబీజాలు, ఆవృత బీజాలు లాంటి మొక్కల లక్షణాలు, పోలికలు, తేడాలు తెలుసుకుంటారు.

- ★ **పరీక్షల కోసం:** ఈ అధ్యాయాల్లో సుమారు 48 అతి స్వల్ప సమాధాన ప్రశ్నలు ఉన్నాయి. వీటన్నింటిని తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. ఈ విభాగం నుంచి కనీసం మూడు 2 మార్కుల (అతి స్వల్ప సమాధాన తరహావి) ప్రశ్నలు వచ్చే వీలుంటుంది. కాబట్టి వీటిని నాలుగు/ అయిదు అసైన్‌మెంట్లుగా విభజించుకుని నేర్చుకోవచ్చు. అదే విధంగా ఈ విభాగంలో కనీసం 2 స్వల్ప సమాధాన ప్రశ్నలు (స్వల్ప సమాధాన తరహా) పరీక్ష పత్రంలో కనిపించే అవకాశముంది. వర్గీకరణ సహాయకాలు, ద్వినామ నామీకరణం, యూగ్లీనాయిడ్‌లు, క్రైసోఫైట్లు, డైనోఫ్లాజల్లేట్‌ల లక్షణాలు, శైవలాలు, బ్రయోఫైట్లు, శిలీంధ్రాల ఆర్థిక ప్రాముఖ్యత, ఎరుపు/ గోధుమ శైవలాల మధ్య తేడాలు, లివర్‌వర్ట్‌లు/ మాస్‌లు, ఏకదళ బీజాలు/ ద్విదళ బీజాల మధ్య తేడాలు, వ్యవసాయ, ఉద్యాన, ఔషధ రంగాల్లో వృక్షశాస్త్ర పరిధి లాంటి అంశాలకు సంబంధించిన ప్రశ్నలు బాగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

యూనిట్ - II

అధ్యాయం- 5 పుష్పించే మొక్కల స్వరూపశాస్త్రం. దీనిలో ప్రధానంగా కాండం, వేరు, పత్రాలు లాంటి శాఖీయ భాగాలు, పుష్పం, ఫలం లాంటి ప్రత్యుత్పత్తి భాగాల స్వరూపం, రూపాంతరాలు, పుష్పవిన్యాస రకాలకు సంబంధించిన వర్ణన ఉంటుంది. ప్రయోగాలపరంగా ఈ అధ్యాయం చాలా ముఖ్యమైంది, ఆసక్తికరమైంది. పుస్తకంలోని అనేక ఉదాహరణలు మనం ప్రత్యక్షంగా చూసే వీలుంటుంది. ప్రయోగశాలలోని స్పెసిమెన్‌లను పరిశీలించి, వీటి లక్షణాలను బాగా అధ్యయనం చేయొచ్చు.

- ★ ముఖ్యంగా వేరు రూపాంతరాలు, కాండ రూపాంతరాలు, అనిశ్చిత పుష్ప విన్యాసం రకాలు లాంటి 8 మార్కుల ప్రశ్నలు (దీర్ఘ సమాధాన ప్రశ్నలు) తప్పనిసరిగా నేర్చుకోవాలి. వీటికి సంబంధించి పటాలను గీసి, భాగాలను గుర్తించాలి. వీటికి కనీసం 3 మార్కులు కేటాయిస్తారు (జవాబు రాసినందుకు 5 మార్కులు). ఈ అధ్యాయంలోని 24 రెండు మార్కుల ప్రశ్నలకు సమాధానాలు నేర్చుకున్నట్లయితే పరీక్షలో కనీసం రెండు ప్రశ్నలు రాయగలుగుతారు. మొత్తానికి ఈ విభాగం నుంచి తప్పనిసరిగా 8 మార్కుల ప్రశ్నలు, 2 మార్కుల ప్రశ్నలు అధ్యయనం చేయాలి. పటాలు గీసే నైపుణ్యం రికార్డు వర్క్‌కు కూడా ఉపయోగపడుతుంది.

యూనిట్ - III

6, 7 అధ్యాయాల్లో మొక్కల్లో వివిధ రకాల ప్రత్యుత్పత్తి విధానాలు, పుష్పించే మొక్కల్లో లైంగిక ప్రత్యుత్పత్తికి సంబంధించిన పరాగ సంపర్కం, ఫలదీకరణం, పిండకోశ నిర్మాణం లాంటి అంశాలు ఉంటాయి. ఈ విభాగంలో 4, 8 మార్కుల ప్రశ్నలు ప్రధానమైనవి.

- ★ అలైంగిక, లైంగిక ప్రత్యుత్పత్తుల మధ్య తేడాలు, ఫలదీకరణం తర్వాత మార్పులు, అండంలోకి పరాగనాళం ప్రవేశించే పద్ధతులు, బ్యాగింగ్, విపుంసీకరణ, త్రిసంయోగం లాంటి అంశాలపై 4 మార్కుల ప్రశ్నలు, పుష్పంలోని ఫలదీకరణానంతర మార్పులు, పిండకోశం పటం వర్ణన, సూక్ష్మసిద్ధ బీజాశయం, ఫలదీకరణ విధానం లాంటి 8 మార్కుల ప్రశ్నలు ముఖ్యమైనవి.

యూనిట్ - IV

అధ్యాయం 8 లో మొక్కల సిస్టమాటిక్స్ - ఆవృత బీజాల వర్గీకరణ గురించి వివరించారు. మొక్కల స్వరూపాన్ని సాంకేతిక వర్ణన ద్వారా శాఖీయ, పుష్ప లక్షణాలను అవగాహన చేసుకోవచ్చు. అయిదో అధ్యాయంలోని అన్ని అంశాలు ఈ అధ్యాయంలో ఉపయోగపడతాయి. ఫాబేసి, సొలనేసి, లిలియేసి కుటుంబాలకు చెందిన ముఖ్యమైన మొక్కలు, వాటి శాఖీయ, పుష్ప లక్షణాలు, ఆర్థిక ప్రాముఖ్యత ఇందులోని ముఖ్యమైన అంశాలు. ఈ అధ్యాయంలో ప్రశ్నలు తక్కువ. సులభంగా మార్కులు సంపాదించే వీలుంటుంది. 2, 4 మార్కుల ప్రశ్నలు తప్పనిసరిగా చదివితే పరీక్షలో 6 మార్కులు కచ్చితంగా సాధించవచ్చు.

యూనిట్ - V

కణ నిర్మాణం, విధుల్లోని 9, 10, 11 అధ్యాయాల్లో కణ నిర్మాణం, కణాంగాలు, విధులు, జీవాణువులు, కణచక్రం, సమ విభజన, క్షయకరణ విభజన అంశాలు ఉన్నాయి. 3 అధ్యాయాల్లో కలిపి 2 మార్కుల ప్రశ్నలు 39 ఉంటాయి. వీటన్నింటిని నేర్చుకోగలిగితే ఈ విభాగం నుంచి వచ్చే మూడు 2 మార్కుల ప్రశ్నలకు సులభంగా సమాధానాలు రాయొచ్చు.

- ★ ఈ విభాగం నుంచి కనీసం 2 నాలుగు మార్కుల ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. హరిత రేణువు, మైటోకాండ్రియా నిర్మాణం, కేంద్రకం, కణ సిద్ధాంతం, క్రోమోసోమ్ రకాలు, కేంద్రక పూర్వకణం లక్షణాలు, కేంద్రకామ్లం, ప్రోటీన్ నిర్మాణం, అంతర్దశ, క్షయకరణ విభజనలోని ప్రథమ దశ- I లోని అంశాలు 4 మార్కుల ప్రశ్నలుగా ఇస్తారు.

యూనిట్ - VI

మొక్కల అంతర్నిర్మాణం సంవిధానంలోని అధ్యాయం 12 లో కణజాలశాస్త్రం, అంతర్నిర్మాణ శాస్త్రం గురించి తెలుసుకుంటారు. వృక్ష కణజాలాలు, రకాలు, సరళ, సంక్లిష్ట కణజాలాలు, వాటి విధులు, కాండం, వేరు, పత్రం అంతర్నిర్మాణం లాంటి అంశాలు ముఖ్యమైనవి. ఈ విభాగంలో ప్రయోగ పూర్వకంగా ద్విదళబీజ, ఏకదళబీజ వేరు, కాండాలను అడ్డుకోత తీసి సూక్ష్మదర్శిని ద్వారా పరిశీలిస్తారు. వీటి పటాలు గీసి, భాగాలను గుర్తించడం చాలా ముఖ్యం.

- ★ ఈ విభాగం నుంచి తప్పనిసరిగా ఒక 8 మార్కుల ప్రశ్న రావచ్చు. కాబట్టి సరైన వాల్యూ పాయింట్‌లను నేర్చుకుని, పటాలు గీయడం బాగా సాధన చేయాలి. అదే విధంగా నాలుగు మార్కుల ప్రశ్నలకు సంబంధించి వివిధ రకాల విభాజ్య కణజాలాలు, పరిచర్మం, వాయురంధ్రాలు, పత్రరంధ్రాల మధ్య భేదాలు, బెండు విభాజ్య కణజాలం, వార్షిక వలయాలు లాంటి అంశాలు చదవాలి.

యూనిట్ - VII

అధ్యాయం - 13 లో ఆవరణ శాస్త్రంలోని మౌలిక అంశాలను చేర్చారు. ఆవరణ సంబంధ అనుకూలనాలు, మొక్కల అనుక్రమం, ఆవరణ సంబంధ సేవల గురించి నేర్చుకుంటారు. ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన భౌగోళిక అంశాలు ఇందులో ఉన్నాయి. పరీక్షల పరంగా 2 మార్కులు, 4 మార్కుల ప్రశ్నలు ముఖ్యమైనవి. 4 మార్కుల ప్రశ్నలకు సంబంధించి నీటి మొక్కల రకాలు, ఎడారి మొక్కల రకాలు, నీటి మొక్కల ఆవరణ సంబంధ అనుకూలనాలు, ఎడారి మొక్కల ఆవరణ సంబంధ అనుకూలనాలు, ఆవరణ సంబంధ సేవలు లాంటివి ముఖ్యమైనవి.

- ★ విద్యార్థులు తగిన విధంగా ప్రణాళికాబద్ధంగా సిలబస్‌ను ముందుగానే విభజించుకుని థియరీ పరీక్షలకు, అదే విధంగా రెండో సంవత్సరంలో జరిగే ప్రయోగ పరీక్షలకు ఇప్పటినుంచే తయారు కావాలి. ముందు జరిగిన పరీక్ష పత్రాలను పరిశీలించి వెయిటేజీని దృష్టిలో ఉంచుకుని, ప్రయత్నించినట్లయితే ప్రతి ఒక్కరూ కచ్చితంగా 60/60 మార్కులు సాధించవచ్చు.

ఇవి గుర్తుంచుకోండి..

- ★ ప్రతి పాఠ్యాంశాన్ని పూర్తిగా అవగాహన చేసుకుని చదవాలి.
- ★ కీ పాయింట్‌లను తయారు చేసుకోవాలి.
- ★ రెండు మార్కుల ప్రశ్నలకు వీలైనంత క్లుప్తంగా, కచ్చితమైన సమాధానాలు తయారు చేసుకోవాలి.
- ★ రెండు మార్కుల ప్రశ్నలకు ఛాయిస్ ఉండదు కాబట్టి పూర్తి మార్కులు సాధించాలంటే అన్ని ప్రశ్నలు చదవాలి.
- ★ నాలుగు మార్కుల ప్రశ్నలకు (స్వల్ప సమాధాన తరహా) వాల్యూ పాయింట్‌లు కనీసం ఎనిమిది రాసుకుని, నేర్చుకోవాలి. అవసరమైన ప్రశ్నలకు పటాలు గీసి, భాగాలు గుర్తించాలి.
- ★ ఎనిమిది మార్కుల ప్రశ్నలకు (దీర్ఘసమాధాన ప్రశ్నలు) జవాబు రాసేటప్పుడు పూర్తిగా వివరణలు, నిర్వచనాలు, ఉదాహరణలు, విధానాలు రాయాల్సి ఉంటుంది. పటాలు గీసి, భాగాలు గుర్తించడానికి కనీసం 3 మార్కులు కేటాయించారని గుర్తుంచుకోండి.



రచయిత
డాక్టర్ పి. ఉమాఅమరేశ్వరి
సీనియర్ లెక్చరర్

మాదిరి ప్రశ్నపత్రం

సమయం: 3 గంటలు | మార్కులు: 60

విభాగం - I

- ★ అతి స్వల్ప సమాధాన తరహా ప్రశ్నలు.
- ★ అన్ని ప్రశ్నలు వరుస క్రమంలో ఒకేచోట రాయాలి.
- ★ ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు.

$2 \times 10 = 20$ M

1. 'బాటనీ' అనే పదం ఏ విధంగా వాడుకలోకి వచ్చిందో వివరించండి.
2. గోధుమ వర్ణ, ఎరుపు వర్ణ శైవలాల్లో ఆ రంగులకు కారణమైన పదార్థాల పేర్లు తెలపండి.
3. వర్గీకరణలో మౌలిక ప్రమాణం ఏది? దాన్ని నిర్వచించండి.
4. మధ్యాభిసార, నిశ్చిత పుష్ప విన్యాసాల మధ్య ఉన్న భేదాన్ని తెలపండి.
5. మకుటదళోపరిస్థితం అంటే ఏమిటి? ఒక ఉదాహరణ ఇవ్వండి.
6. ఒమేగా వర్గీకరణ శాస్త్రం అంటే ఏమిటి?
7. మోటాసెంట్రిక్ క్రోమోసోమ్ లక్షణం ఏమిటి?
8. ప్రాథమిక, ద్వితీయ జీవక్రియోత్పన్నాలు అంటే ఏమిటి? ఉదాహరణలు ఇవ్వండి.
9. ఒక కణజాలంలో 1024 కణాలు ఉంటే ప్రథమ జనక కణం ఎన్నిసార్లు సమవిభజన చెంది ఉంటుంది?
10. జనాభా, సముదాయాలను నిర్వచించండి.

విభాగం-II

- ★ స్వల్ప సమాధాన తరహా ప్రశ్నలు.
- ★ ఏవైనా ఆరు ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

$6 \times 4 = 24$ M

11. మన దైనందిన జీవితంలో శిలీంధ్రాల పాత్ర గురించి రాయండి.
12. వృక్ష శరీరధర్మశాస్త్రాన్ని ఉదాహరణగా తీసుకుని వృక్ష శాస్త్ర పరిధిని వివరించండి.
13. అలైంగిక, లైంగిక ప్రత్యుత్పత్తుల మధ్య తేడాలను గుర్తించండి. శాఖీయ ప్రత్యుత్పత్తిని కూడా ఒక రకమైన అలైంగిక ప్రత్యుత్పత్తి రకంగా ఎందుకు పరిగణిస్తారు?
14. ఫాబేసికి చెందిన మొక్కల ఆర్థిక ప్రాముఖ్యతను తెలపండి.
15. కణ శక్త్యాగారాల నిర్మాణం, విధులను వివరించండి.
16. క్షయకరణ విభజనలోని ముఖ్యాంశాలను తెలపండి.
17. వాయు రంధ్రాలు, పత్ర రంధ్రాల మధ్య ఉండే భేదాలు ఏమిటి?
18. ఆవరణ-సంబంధ విధులను కొనసాగించడం కోసం తీసుకోవాల్సిన చర్యలను గురించి రాయండి.

విభాగం -III

- ★ దీర్ఘ సమాధాన తరహా ప్రశ్నలు.
- ★ ఏవైనా రెండు ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

$8 \times 2 = 16$ M

19. వేరు రూపాంతరాన్ని నిర్వచించండి. వివిధ విధులను నిర్వర్తించడానికి వేరు ఏ విధంగా రూపాంతరం చెందిందో వివరించండి.
20. ఆవృత బీజ మొక్కల్లో జరిగే ఫలదీకరణ విధానాన్ని వివరించండి.
21. ద్విదళ బీజ కాండం అడ్డుకోతను వివరించండి.

Kantipudi Kameswara Rao

Q: Respected sir, how many kinds of subscriptions are there in English letter writing?

A: i) Yours faithfully, when you write to higher authorities or superiors.

ii) Yours sincerely, when you write to your friends, people who you don't know and you are writing for the first time.

iii) Yours obediently, when you write to your teachers, head master, principal, etc.,

iv) Yours truly, when you are writing to strangers,

v) Yours affectionately/ yours lovingly when you are writing to the members of your family, and

vi) Yours ever, when you are writing to your wife/ the girl you love. Nowadays, however, in email correspondence, no subscriptions are used.

Ch. Satyanarayana

Q: Respected sir, could you please tell us the difference in use of the following words. Contain, Comprise, Consist.

A: Contain = have something within something else.

Eg: The purse contains her money = the purse has her money in it.

★ Comprise = consist of (to be made of or formed of something).

Eg: The book comprises twenty chapters = It consists of twenty chapters = the number of chapters included in the book are twenty.

N. Bhaktavatsalam, Nellore

Q: నిన్న సాయంత్రం రోడ్డు మీద నడుస్తుంటే, రాయి తగిలి, బోర్లా పడ్డాను - ఈ వాక్యాన్ని ఇంగ్లిష్‌లోకి అనువదించగలరు.

A: As I was walking down the road, I slipped over a stone, and fell face downwards.

ప్రతిభ SPOKEN ENGLISH 955

మీ ప్రశ్నలు పంపాల్సిన చిరునామా...

స్పోకెన్ ఇంగ్లిష్, ప్రతిభ విభాగం,
ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిల్మ్ సిటీ,
అనాజ్‌పూర్, రంగారెడ్డి జిల్లా.

Email your questions to: pratibhadesk@eenadu.net

Award, Reward మధ్య తేడా..?



K. Saraswathi

Q: Sir, let me know the meanings of the following with examples.

1) Probe 2) Stake 3) Stand off
4) Crack down 5) Sworn in
6) Swearing in
7) Inauguration, commencement
8) Nipped in the buds.

A: 1) Probe = search / examine something carefully.

Eg: The CBI is probing into the corruption charges against the official.

2) Stake: Three meanings; a) A share in business. **Eg:** He holds a 30% stake in the business.

b) Costs / risks involved.

Eg: Competition has raised the stakes in Global business.

c) Bet. **Eg:** Dharmaraja staked Drowpadi in the game of dice. (he offered her as a bet).

3) Stand off: a) A competition in which neither side wins.

Eg: There was a stand off between the two teams (the game was a draw).

b) A situation in which somebody threatens an official and prevents them from acting.

4) Crack down: To take strong action to stop something bad from happening.

Eg: The tax officials and police cracked down on people with black money.

5) Sworn in: Someone elected promising to people they would discharge their duties to the best of their best to serve people. **Eg:** The high court judge sworn in the governor.

6) Swearing in = Promising to people that they would discharge their duties. (swear = promise)

7) Inauguration = A formal beginning / formal induction of somebody into office.

Commencement = Beginning. **Eg:** The commencement of the match took place at 9 AM. However, beginning is simpler than commencement.

8) Nip something in the bud (not, nipped in the buds) = stop something at an early stage, without allowing it to become a big problem. **Eg:** They should have nipped in the bud the agitation for a separate state.

Mahesh, Uravakonda

Q: సర్, కింది వాక్యాల మధ్య తేడాను తెలుగులో వివరించగలరు.

1) He was punished
2) He was to be punished.
3) He is liable to be punished.

A: 1) అతడిని శిక్షించారు.
2) అతడికి శిక్ష పడాల్సి ఉండింది.
3) అతడికి శిక్ష తప్పకుండా పడుతుంది.

Q: Sir, please translate the following into Telugu.

1) A man who wanted to be a patriot.
2) You have to develop proper instructions to be given to it.
3) They are to be get the same place.
4) Two chlorine atoms has to be an s-p bond.
5) To be or not to be is the problem.
6) Do you like to be let alone?



7) Cause to be done.
8) Right to be elected and hold office.
9) If the United Nations is to be a universal organisation in the true sense.
10) Who are accepted to be a legal personality.
11) The proposition seems to be unfeasible.

A: 1) దేశభక్తుడు కావాలనుకున్నతను.



Writer

- M. Suresan

2) నువ్వు తగిన సూచనలు పెంపొందించుకోవాలి, దానికి ఇవ్వడానికి - ఈ వాక్యానికి అర్థం లేదు.
3) వాళ్లకు అదే స్థానం రావాలి.
4) రెండు క్లోరిన్ అణువులు s - p బంధంలో ఉండాలి.
5) ఉండటమా, పోవడమా (చనిపోవడమా) అనేదే సమస్య.
6) నిన్ను ఒంటరిగా వదిలేయడం నీకు ఇష్టమా?
7) చేయించడం
8) ఎన్నికవడానికి, ఒక పదవిని స్వీకరించేందుకు హక్కు.
9) ఐక్య రాజ్య సంస్థ నిజంగా విశ్వ సంస్థగా ఉండాలంటే.
10) ఎవరినైతే చట్ట సమ్మతమైన వ్యక్తిగా అంగీకరిస్తారో.
11) ఈ ప్రతిపాదన ఆమోదయోగ్యం కానిదిగా కనిపిస్తుంది.

Rafi

Q: Sir, I am a teacher in school. i) Could you please tell me the difference between the spoken English, functional English and Communicative English and also the difference between ii) ..... he went off, ... away, and just .... he went.

A: i) Spoken English means, English as it is spoken. It is colloquial. Communicative English is English used for communication, both spoken and written. Functional English means English used for certain functions, like wishing people when you first meet them, opening conversation with familiar and unfamiliar people, asking for the way to a certain place, requesting people to help you etc.

ii) He went off = He went away. 'He went' is not proper English unless it is followed by the place which he went to.

J. Satyanarayana

Q: Respected sir, please tell me the meaning of below mentioned sentence in Telugu.

'no one is indispensable'

A: ఎవరూ అంత అత్యవసరం కాదు./ ఎవరు లేక పోయినా పని జరిగిపోతుంది.

B. Devendra

Q: Sir what is the difference between Award and Reward ?

A: Award = Something given to a person in recognition of their services. Padmasree, Padmabhushan, etc., are awards. Rewards are things given to people for their particular achievements.

Vasa Mahesh, Visakhapatnam

Q: Good morning sir, can I use the "Idioms and phrases" in essay writing topics like IELTS or TOEFL exams?

A: Why not? While writing essays in exams like IELTS and TOEFL, you get even more marks for your idiomatic English than for your plain English. Go ahead, and learn as many idioms and phrases as you can and use them in TOEFL and IELTS.

Prince Revanth

Q: Sir, could you please tell me the meanings of following:

1) Subjection 2) Arbitrary

A: 1) 'Subjection' is the ruling of one country by a single person, or by another country. Eg: India was under the subjection of the British Rule till 1947. India was under the subjection of the Moghul rule till the 17th century.

2) Depending on a person's will or choice without any reason or logic. A king rules his country arbitrarily (that is, without any reason, logic, system, etc.) ఇష్టం వచ్చినట్లు.

Divvela Surya Teja


Q: Sir, please translate the following word into English. నీకెందుకు?

A: How are you concerned? / Is that any of your business? / What have you got to do with it?

'స్పోకెన్ ఇంగ్లిష్' పాత సంచికల కోసం చూడండి..

www.eenadupratibha.net

Y. Alekhya



Q: Sir, let me know the difference between 'when', while'. And in which contexts we can use the word towards?

A: When and while are almost the same. However, when is mostly used with simple tenses, while is used with continuous tenses.

Examples: 1) When he returned home, he found his dog missing.

2) While her sister was singing, she was dancing.

Sharanya. K

Q: Sir, please translate the following sentence. "It looks nice, isn't it?"

What is the meaning of isn't it? when we use this? Please explain.

A: 'It looks nice, isn't it'? - here the question tag is wrong. The correct question tag is, 'It looks nice, doesn't it?' Question tags like 'isn't it', 'doesn't it' etc., in Telugu mean, ఔనా, కాదా, కదా, లేదా.

హాయ్! బుజ్జీ!!



మలేషియా

మలేషియా...
మనకు తెలిసిన పేరే... మరి తెలియని
ఈ దేశ కబుర్లేంటో తెలుసుకుందామా!

✤ ఆసియా ఖండంలోని ముఖ్య దేశాల్లో మలేషియా ఒకటి.

✤ పూర్వం డచ్, బ్రిటిషర్ల పాలనలో ఉన్న ఇది 1957లో పూర్తి స్వాతంత్ర్యం పొందింది.

✤ ఇక్కడి జాతీయ రహదారుల పొడవు 65,877 కిలోమీటర్లు. అంటే మొత్తం భూమి చుట్టుకొలత కంటే కూడా ఎక్కువ. (భూమి చుట్టుకొలత 40,075 కిలోమీటర్లు మాత్రమే)

✤ మలేషియా అనగానే జంట టవర్లే గుర్తొస్తాయి. వీటి పేరు 'పెట్రోనాస్ ట్విన్ టవర్లు'. ఒక్కోదాంట్లో 88 అంతస్తులుంటాయి. వీటి ఎత్తు 450 మీటర్లు. అంటే ఈఫిల్ టవర్ కంటే ఎత్తయినవే అన్నమాట. వీటిలో కార్యాలయాలుంటాయి.

✤ రబ్బరు ఉత్పత్తి చేయడంలో ప్రపంచంలో మూడో అతి పెద్ద దేశమిది. 2011 సంవత్సరంలోనే 9,96,673 మెట్రిక్ టన్నుల రబ్బరును ఉత్పత్తి చేసింది. ప్రపంచంలోనే రబ్బరు చేతి తొడుగులు తయారు చేయడంలో ప్రసిద్ధి చెందిందీ దేశం.

✤ ప్రపంచంలోనే అతి పెద్ద కార్తికేయుడి (సుబ్రహ్మణ్యేశ్వరస్వామి) విగ్రహం ఉన్నది ఇక్కడి బాటు గుహల్లోని ఆలయం దగ్గరే. దీని ఎత్తు 140 అడుగులు. అంటే ఓ పద్నాలుగు అంతస్తుల భవనమంత.

✤ అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చుకుంటే ఇక్కడ దుస్తులు, ఆహారం, నివాస వసతుల కోసం అయ్యే ఖర్చు తక్కువే.

✤ వీరి ఆహార అలవాట్లు మనకులాగే ఉంటాయి. మధ్యాహ్న భోజనంలో గుడ్డు, కొబ్బరన్నం, కారంగా ఉండే సంబల్ చిల్లీ పేస్ట్, వేరుసెనగ గింజలు, దోసకాయ ముక్కలు... లాంటివి ఉంటాయి.

ఆధునిక మానవుడి అడుగుజాడలు ఇక్కడే!





విదేశం... విశేషం!

దేశం: మలేషియా
రాజధాని: కౌలాలంపూర్
కరెన్సీ: మలేషియన్ రింగెట్
జనాభా: 3,15,48,000 **విస్తీర్ణం:** 3,30,803 చదరపు కిలోమీటర్లు
అధికారిక భాష: బహాసా మలేషియా **అధికారిక లిపి:** మలయ్

జెండా: జెండాపై ఉన్న ఎరుపు, తెలుపు రంగు గీతలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సమాన హోదాకూ, నక్షత్రం వారి ఐకమత్యానికీ నిదర్శనం. పక్కనున్న అర్ధ చంద్రుడు వారి అధికారిక మతం ఇస్లాంకు ప్రతీక.



✤ ప్రపంచంలోనే పొడవైన(కేవ్ ఛాంబర్) గుహ గది ఉన్నది ఇక్కడి సర్వాక్ ఛాంబర్ గుహల్లోనే. ✤ ఈ దేశ కరెన్సీ రింగెట్. స్థానికులు మాత్రం డాలర్ అనే పిలుచుకుంటారు. దీని విలువ ఇప్పుడు మన కరెన్సీలో దాదాపు 14 నుంచి 15 రూపాయలుంది.



✤ మలేషియాలో 40,000 సంవత్సరాలకు ముందు ఆధునిక మానవుడు నివసించినట్టు ఆధారాలు దొరికాయి. క్రీస్తుశకం మొదటి శతాబ్దం నుంచి ఇక్కడికి భారత్, చైనా నుంచి వ్యాపారులు వలసవచ్చారట. రెండో, మూడో శతాబ్దాల్లో వాణిజ్య రేవులు, తీర ప్రాంత నగరాలు నిర్మించుకున్నారు. దీంతో ఈ దేశ ప్రజలపై భారతీయ, చైనా సంస్కృతులు, సంప్రదాయాల ప్రభావం పడటం మొదలైంది.

✤ వీధి గోడలపై బొమ్మలేసే కళకు ఇక్కడ చాలా ఆదరణ ఉంది. అందుకే ఇక్కడి వీధుల్లో ఎక్కడ చూసినా, ముఖ్యంగా కౌలా లంపూర్‌లో గోడలపై చాలా బొమ్మలు కనిపిస్తుంటాయి.

✤ మనిషికి దగ్గర పోలికలతో ఉండే తోకలేని కోతులు 'ఒరాంగుటాన్లు' తెలుసుగా. ప్రస్తుతం ఇవి ఈ దేశ సమీపంలోని బోర్నియో, సుమాత్ర దీవుల్లో మాత్రమే ఉన్నాయి.

✤ ప్రపంచంలోనే విడిపోకుండా ఉన్న అతి పెద్ద ఆకు ఇక్కడి సాభాలో ఉంది. అది అలోకాసియా మక్రోరైజ మొక్కది. 3.2 మీటర్ల పొడవు, 1.92 మీటర్ల వెడల్పు ఉంటుంది.

✤ ఇక్కడున్న వలసదారుల్లో చైనీయులు, భారతీయులే ఎక్కువ.

✤ ఇప్పుడు స్వతంత్రంగా ఉన్న సింగపూర్ దేశం గతంలో మలేషియాలోని ఒక రాష్ట్రం.

చిలిపి ప్రశ్న

తక్కువ, ఎక్కువకు తేడా ఏంటి?

- జి.డి.ఆర్. పట్నాయక్, ఖమ్మం

ప్రశ్న: సముద్రాల్లో ఉండే అగ్ని పర్వతాల చుట్టూ నీరు ఉంది కాబట్టి ఆ పర్వతాలు చల్లారిపోవాలి. కానీ అవి అగ్ని చిమ్ముతూ ఉంటాయెందుకని?

- బి. రాజేశ్వర్, పొన్కల్

సముద్రంలోని అగ్నిపర్వతాలు చల్లారిపోవే?

ఎందుకు? ఏమిటి? ఎలా?

జవాబు: సముద్రాల అడుగునున్న చాలా అగ్ని పర్వతాలు లావా వెదజల్లకుండా వెంటనే చల్లారి పోతుంటాయి. కానీ తీవ్రమైన ఒత్తిడితో సముద్రపు లోతు భాగాన ఉన్న నేల పొరకన్నా, ఇంకా అట్టడుగు పొరల్లోంచి మాగ్మా చిమ్ముకొస్తుంటుంది. ఇది చాలా ఒత్తిడితో బయటకు రావడం వల్ల సముద్రపు నీటితో చల్లారదు. దీంతో అగ్ని కీలల్లాగ అప్పుడప్పుడు లావాని చిమ్ముతాయి. అయితే ఇలా లావా చిమ్మడం అదే పనిగా, ఒకేలా ఉండదు.

సముద్రపు అడుగు భాగాల్లో అగ్ని పర్వతాలు ఉన్నట్లయితే వాటి నుంచి చిమ్మే లావా అడుగునే చల్లారిపోయినా ఆ లావాలో ఉండే వాయువులు బుగ్గల్లా, బుడగల్లా సముద్రపు మట్టానికి చేరుకుంటాయి. ఆ వాయువుల విషతత్వం, వేడి వల్ల అక్కడ సముద్ర జీవులు బతకలేవు. అందుకే సముద్రపు నీటి ఉపరితలం నుంచి వేడి వాయువులు వస్తున్నా, అక్కడి నీటి రంగు మరోలా ఉన్నా అడుగున అగ్ని పర్వతాలున్నట్లు భావించొచ్చు.

- ప్రొ॥ ఎ. రామచంద్రయ్య, నిట్, వరంగల్; ఎడిటర్, చెకుముకి, జనవిజ్ఞాన వేదిక (తెలంగాణ)



మన శక్తి కన్నా
చాలా సార్లు సహనం
మంచి ఫలితాల్ని ఇస్తుంది
- ఎమర్సన్

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Qualification = యోగ్యత
- నమూనా = మాదిరి

నవ్వుల జల్లులు!

టీచర్: రెండు లీటర్ల పాలకు రెండు లీటర్ల నీళ్లు కలిపితే ఏమవుతుంది?
రవి: పెద్ద గొడవవుతుంది టీచర్!

రాధ: నీ చేతి రాత ఇంత చెత్తగా ఉంది అయినా ఇన్ని మార్కులు ఎలా వచ్చాయి రా?
లడ్డు: అలా రాయబట్టే పరీక్షల్లో నా తప్పులు పట్టుకోలేదక్కా!

- పి.వి.రమణకుమార్, చిలకలూరి పేట


అవే పదాలు

ఆధారాలతో తెలుగు పదాలను గడుల్లో రాయండి. అడ్డంగానైనా, నిలువుగానైనా అవే పదాలు వస్తాయి

1. SMOOTH			
2. FOREHEAD			
3. WORM			

- ఎం.వి.కృష్ణసమీరా, బెంగళూరు

అక్షరాలా బొమ్మ



జవాబులు: చిలిపి ప్రశ్న: మొదటి అక్షరం! అవే పదాలు : 1. నునుపు 2. నుదురు 3. పురుగు

వేడుకగా మహాలింగార్చన పూజలు

తనపల్లెక్రాస్(తిరుపతి నగరం), న్యూస్‌టుడే: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో జరుగుతున్న శత చండీయాగంలో భాగంగా నాల్గవ రోజు మహాలింగార్చన పూజలు వేడుకగా నిర్వహించారు. తిరువణ్ణామలై శ్రీ అరుణాచల అన్నపూర్ణ ఆశ్రమం ట్రస్టు నిర్వాహకులు శివానందలహరి ఆధ్వర్యంలో ఉదయం నుంచి యాగశాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. చండీయాగంలో పాల్గొనేందుకు వస్తున్న భక్తులతో శిల్పారామం సందడిగా మారింది. సోమవారంతో యాగం ముగిస్తుందని శివానందలహరి స్వామి చెప్పారు. తితిదే పాలకమండలి మాజీ ఛైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి యాగంలో పాల్గొని అన్నపూర్ణేశ్వరిదేవికి పూజలు చేశారు. కార్యక్రమంలో యాగం నిర్వాహకులు మదన్‌మోహన్‌నాయుడు, సందీప్, శ్రీసాయిసుధా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అధినేత్రి డాక్టర్ సుధారాణి, డాక్టర్ సుకుమార్, శిల్పారామం పరిపాలనాధికారి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అన్నపూర్ణేశ్వరి దేవి విగ్రహానికి పూజలు చేస్తున్న చదలవాడ కృష్ణమూర్తి

ఆరోగ్యంగా సంగీతఛటర్జీ

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే : జిల్లా కారాగారంలో గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఎర్రచందనం మహిళా స్మగ్లర్ సంగీతఛటర్జీ ఆరోగ్యం కుదుటపడింది. రెండ్రోజుల పాటు చిత్తూరు, తిరుపతి రుయాలో చికిత్స పొందిన ఆమెను శనివారం సాయంత్రం 4 గంటలకు వైద్యులు డిశ్చార్జి చేసి జైలుకు తరలించారు. మరుగుదొడ్డిని శుభ్రం చేసే ద్రవాన్ని తాగి బలవన్మరణానికి యత్నించడం కలకలం రేపిన విషయం తెలిసిందే. అయితే.. ఆమె ఆత్మహత్యాయత్నంకు కారణాలు మాత్రం స్పష్టంగా తెలియడం లేదు. వేధింపులు, కడుపునొప్పి కారణంగా బలవన్మరణానికి పాల్పడినట్లు ఆమె చెప్పినా.. ఆమె జైలులో ఎలాంటి వేధింపులు ఎదుర్కొంటోంది, ఎవరు ఇబ్బంది కి గురిచేస్తున్నారనే అంశం ఇంకా ప్రశ్నగానే ఉంది. బెయిల్ మంజూరు కాలేదని మానసికంగా కృంగిపోతూ బలవన్మరణానికి పాల్పడినట్లు కూడా వాదనలు వినిపిస్తోంది. అయితే.. వేధింపులు.. కడుపునొప్పి కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితురాలు చెప్పడం అధికారుల్లో కలకలం రేపింది. దీనిపై సంజాయిషి ఇవ్వాలని జైలు శాఖ ఉన్నతాధికారులు జైలు అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

ఎంపీఈవోల నియామకానికి అనుమతి

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే : జిల్లా వ్యవసాయ శాఖలో ఖాళీగా ఉన్న బహుళ ప్రయోజన విస్తరణాధికారు(ఎంపీఈవో)ల నియామకానికి జిల్లా పాలనాధికారి ప్రద్యుమ్న ఆమోదముద్ర వేశారు. ప్రభుత్వం జిల్లా వ్యవసాయ శాఖకు 244 ఎంపీఈవోలను నియమించింది. ప్రస్తుతం 197 మంది ఎంపీఈవోలు విధులు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఖాళీగా ఉన్న 44 పోస్టుల భర్తీకి ఆ శాఖ అధికారులు కసరత్తులు ప్రారంభించారు. పోస్టుల భర్తీలో 1:2 రోస్టర్ ప్రకారం ఇది వరకే దరఖాస్తు చేసుకున్న 79 మందికి కాల్‌లెటర్లు పంపామని వ్యవసాయ శాఖ జేడీ విజయకుమార్ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులకు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు మౌఖిక పరీక్ష ఉంటుందని ఆయన తెలిపారు.

జిల్లాలో కురుస్తున్న వర్షం

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ద్రోణి ప్రభావంతో గత రెండు రోజులుగా జిల్లాలో ఓ మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. గురువారం రాత్రి 61 మండలాల్లో వర్షం కురిసింది. అత్యధికంగా పెద్దమండ్యం మండలంలో 86.6 మి.మీటర్లు కురిసి.. ఒకరోజే సరాసరిగా 13.2 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే శుక్రవారం రాత్రి ఎనిమిది మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. జిల్లాలో ఈ నెలలో సాధారణ వర్షపాతం 117.4 మి.మీటర్లు నమోదు కావాల్సి ఉండగా.. 82.4 మి.మీటర్లు అధికంగా కురిసి 185.2 మి.మీటర్లు నమోదైంది.

ఖజానా బిల్లులపై ఆంక్షలు

చిత్తూరు(జిల్లా సచివాలయం), న్యూస్‌టుడే : రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో ఖజానా సేవలపై ఆంక్షలు మొదలయ్యాయి. మరో వారం రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాల్సిఉంది. ఈ నేపథ్యంలో మిగిలిన బిల్లుల ఆమోదం, మంజూరుపై ఆర్థిక శాఖ ఆంక్షలు విధించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఇటీవల కొన్ని నెలలుగా నెలాఖరుకు వచ్చే సరికి ఆర్థిక సర్దుబాటు కోసం ఆంక్షలు మొదలవుతున్నాయి. తాజాగా ఖజానా శాఖలో ఇతర బిల్లులు చెల్లింపులపై ఆంక్షలు విధించారు. జీఎస్టీ ప్రభావం, కేంద్రం నుంచి రావాల్సిన నిధులు 1వ తేదీకి అందుబాటులోకి వచ్చే వీలులేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం వద్ద తగిన నగదు నిల్వలు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఉద్యోగుల వేతనాలకు సర్దుబాటు చేసుకోవాల్సిన పరిస్థితుల్లో ఖజానా శాఖలో బిల్లులు ఆమోదంపై ఆంక్షలు విధించింది. ఖజానా పరిధిలో కేవలం ఉద్యోగులు వేతనాలకు సంబంధించిన బిల్లులు మాత్రమే ఆమోదించి బ్యాంకులకు పంపుతున్నారు. జిల్లాలో ఉద్యోగుల వేతనాలు, పించన్లకు సుమారు రూ.310కోట్లు నిధులు అవసరం అవుతాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న నిధులతో ఉద్యోగులకు వేతనాలు సర్దుబాటు చేస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ, ఇతర పనులకు సంబంధించిన చెక్కులు, ఎన్‌వోసీలు, జీపీఎస్, ఉద్యోగుల సరెండర్ సెలవుల, ఇంక్రిమెంట్లు, బకాయిలను, అద్దెలు వంటి బిల్లులపై ఆంక్షలు విధించింది. దీంతోపాటుగా వివిధ ప్రభుత్వ శాఖల నుంచి చెల్లించాల్సిన బిల్లులపైనా ఆంక్షలు మొదలైయ్యాయి. సంక్షేమ శాఖల, వ్యవసాయ శాఖల నుంచి చెల్లించాల్సిన పెట్టుబడిరాయితీ బిల్లులపై ఆంక్షలు మొదలయ్యాయి.

28నుంచి మహిళా వర్సిటీలో కార్యశాల

మహిళా విశ్వవిద్యాలయం(తిరుపతి), న్యూస్‌టుడే: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో సోమవారం నుంచి ఐదురోజులపాటు డీబీటీ కార్యశాల జరుగుతుందని కార్యశాల కో-ఆర్డినేటర్ ఆచార్య కళారాణి తెలిపారు. 'ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలెప్‌మెంట్ ఇన్ బయోసైన్సెస్ ఫర్ ఉమెన్' అనే అంశంపై సోమవారం ఉదయం 10గంటలకు వర్సిటీ సావేరి సమావేశ మందిరంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. వర్సిటీ ఉపకులపతి దుర్గాభవాని ముఖ్య అతిథిగా, న్యూఢిల్లీ డీబీటీ శాస్త్రవేత్త అరుణ్, చెన్నై బయోటెక్ పార్క్ ఫర్ ఉమెన్ సీఈవో సుధానాయర్ తదితరులు విచ్చేసి ప్రసంగిస్తారని తెలిపారు.

వీధివీధిన వినాయక సందడి

కొలువుదీరిన గణనాథులు


తిరుపతి: సున్నపువీధిలో దేవతామూర్తుల శిరస్సులతో..


పుంగనూరు: కుమ్మరవీధిలో ఏర్పాటుచేసిన వినాయకుడి ప్రతిమ


వరదయ్యపాళెం: వినాయకప్రతిమ నిమజ్జనోత్సవంలో యువకుల సంబరాలు


తిరుపతి బాలాజీ కాలనీ వద్ద.. విష్ణుమూర్తి చెంత వినాయకుడు


తిరుపతి కోటకొమ్మవీధిలో.. ఆకట్టుకుంటున్న గణపతి


తిరుపతి.. రుణమాఫీ కావాలి.. రైతన్న బతకాలి.. డీఆర్ మహల్ రోడ్డులో రైతన్నగా గణపయ్య


రేణిగుంట... వినాయకనగర్ కాలనీలో గణేష్‌కి భక్తి శ్రద్ధలతో కాలనీ వాసుల పూజలు


తుమ్మలగుంటలో సాయిబాబాగా వినాయకుడు


తిరుపతి సున్నపువీధిలో చక్రధారిగా..


రామసముద్రంలో ఉగ్రనరసింహ స్వామి అలంకారంలో వినాయకస్వామి


గంగవరం: సాయినగర్‌లో శ్రీకృష్ణావతార వినాయకుడు


పీలేరు: గోమాత వద్ద పాలు తాగుతున్న వినాయకుడు


భక్తులకు గణపతిగా దర్శనమిస్తున్న సాయిబాబా